# తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



best deal
HEALTH & WEALTH
"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."
We create opportunities | 9640707117 (What's up only)



ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 147 శుక్రవారం 02 - 10 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial


## రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై
# కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ

- కరవు పరిస్థితులపై చర్యలపై సబ్‌కమిటీలో చర్చ
- కరవు ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణపై దృష్టి
- మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు
- రాష్ట్ర పరిస్థితులపై సమగ్రంగా చర్చించిన కేబినెట్
- త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు




**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 01 :** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. తీవ్ర వర్షాభావం వల్ల దాదాపు 235 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కరవు మండలాల ప్రకటనతో పాటు తగిన సాయం చేయాలని కేంద్రాన్ని కోరాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే దిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదించాలని నిర్ణయించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. డిసెంబరులో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. కుటుంబ యజమాని మరణిస్తే రూ. 5 లక్షల బీమా ఇచ్చే - మిగతా 2 లో

## మా ఆస్తులు.. మీ ఆస్తులు..
# విచారణకు సిద్ధమా?


2 లో

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!
- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్



## రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి
# తీవ్ర విమర్శలు

- శివుడు, రాముడిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగడంపై కిషన్ రెడ్డి అభ్యంతరం
- ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపణ

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 01 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన - మిగతా 2 లో

# ఆసియా క్రీడల్లో నాయుడుపేట కుర్రాడి సత్తా

- తెలుగు ఆర్చర్ గణేశ్‌పై మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు
- ఆసియా గేమ్స్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం
- ఇప్పటికే టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన గణేశ్
- రాష్ట్రానికి, దేశానికి గణేశ్ గొప్ప గౌరవం తెచ్చాడన్న లోకేశ్
- తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన క్రీడాకారుడు




**తొలివార్త, ఢిల్లీ, అక్టోబర్ 01 :** ఆసియా గేమ్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ గణేశ్ మణిరత్నం తిరుమూరుపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో కాంస్య పతకం గెలవడం ద్వారా గణేశ్ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచారని - మిగతా 2 లో

## మరో 15 రోజుల్లో
# ఈశాన్య రుతుపవనాలు రాక




- భారత వాతావరణ శాఖ కీలక ప్రకటన
- అక్టోబరు 15 నుంచి 21 మధ్య దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు వచ్చే ఛాన్స్ ఉందని వెల్లడి
- మరో కొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు ముగియనున్నాయన్న ఐఎండీ

**తొలివార్త, ఢిల్లీ, అక్టోబర్ 01 :** దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 15- అక్టోబర్ 21 మధ్య ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అదే సమయంలో నైరుతి రుతుపవనాలు రాబోయే రెండు- మూడు రోజుల్లో ముగియనున్నాయని వెల్లడించింది. చెన్నైలోని పల్లికరణైలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ)లో ఈశాన్య రుతుపవనాల అంచనాకు సంబంధించి వివిధ శాఖల ప్రతినిధులతో ఒక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర, తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ - మిగతా 2 లో

## భూమికి
# పెరుగుతున్న ముప్పు

- 9 వ్యవస్థల్లో ఇప్పటికే ఏడు కీలక పరిమితులు దాటేశాయి!
- ప్రమాదకర స్థాయికి వాతావరణ మార్పులు
- జీవ వైవిధ్యానికి పెరుగుతున్న ముప్పు
- పరిమితి దాటిన సముద్రాల ఆమ్లీకరణ
- చర్యలకు ఇంకా అవకాశం ఉందన్న శాస్త్రవేత్తలు

2 లో



## సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్
# ఉద్యోగుల ప్రథమ లక్ష్యం కావాలి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- పేదల ఆవేదన అర్థం చేసుకునే మనసు ప్రతి ఉద్యోగికి ఉండాలి
- సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల ప్రథమ లక్ష్యం కావాలని పిలుపు
- దిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రసంగించిన ప్రధాని మోదీ



**తొలివార్త, ఢిల్లీ, అక్టోబర్ 01 :** సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల ప్రథమ లక్ష్యం కావాలని, నాగరిక్ దేవోభవ అనేది ఉద్యోగుల నినాదం కావాలని - మిగతా 2 లో

## ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు
# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!




- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

**తొలివార్త, అమరావతి, అక్టోబర్ 01 :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని - మిగతా 2 లో



## ఏపీలో 15,602 ఫ్యాక్టరీలు
# దేశంలో 6వ స్థానం

- అత్యధిక కర్మాగారాలున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ 6వ స్థానంలో నిలిచింది
- 15,602 కర్మాగారాలతో జాతీయ స్థాయిలో రాష్ట్రం ముందంజలో ఉంది
- తొలి మూడు స్థానాల్లో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర చోటు దక్కించుకున్నాయి

**తొలివార్త, అమరావతి, అక్టోబర్ 01 :** దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఉన్న కర్మాగారాల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచింది. దేశ పారిశ్రామిక రంగానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక పరిశ్రమల సర్వే నివేదికను కేంద్ర గణాంకాలు, అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) విడుదల చేసింది. నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న - మిగతా 2 లో

## పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాకుండా
# మానవీయ కోణంలో చూస్తున్నాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఏపీలో ఇచ్చే పింఛన్ ప్రపంచంలో ఎక్కడా ఇవ్వడం లేదు
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం
- గత వైఎస్సార్సీపీ పాలనలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయారని కూటమి ప్రభుత్వంలో వారంతా ఏపీకి క్యూ కడుతున్నారని చంద్రబాబు అన్నారు
- బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు



**తొలివార్త, అమరావతి, అక్టోబర్ 01 :** 34 శాతం బీసీ రిజర్వేషన్లను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టు వెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలోని అర్వపల్లిలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ఈ అంశంపై స్పందించారు. ఎన్టీఆర్ కాలం నుంచి బీసీలు అండగా ఉన్నారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో తానే 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశానని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన గొడ్డలిపార్టీ రిజర్వేషన్లను 24 శాతానికి మార్చిందని విమర్శించారు. దీంతో 1.68 లక్షల ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక 34 శాతానికి పెంచామని తెలిపారు. కానీ గొడ్డలి పార్టీ మరోసారి కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లను అడ్డుకుందని మండిపడ్డారు. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా అర్వపల్లిలో లబ్ధిదారులకు చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. బీసీ వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా పైకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు తెలిపారు. 45 ఏళ్లుగా టీడీపీకి వెన్నెముకగా ఉన్న బీసీలకు న్యాయం చేస్తామని చెప్పారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. రిజర్వేషన్లు రానీయకుండా వైఎస్సార్సీపీ చాలా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. "పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో చూస్తున్నాం. ఏపీలో ఇచ్చే పింఛన్ ప్రపంచంలో ఎక్కడా ఇవ్వడం లేదు. - మిగతా 2 లో

తొలివార్త
RNI : TGTEL/25/A0357
శుక్రవారం 02 - 10 - 2026

# సంపాదకీయం

## కంటికి కనిపించని ప్లాస్టిక్ ముప్పు




మన చుట్టూ కనిపించే ప్లాస్టిక్ చెత్తకంటే, కంటికి కనిపించకుండా మన నీటిలో, గాలిలో, ఆహారంలోకి చేరుతున్న సూక్ష్మ ప్లాస్టిక్ ఇప్పుడు మరింత పెద్ద ముప్పుగా మారుతోంది. ఒకప్పుడు ప్లాస్టిక్ కాలుష్యం అంటే రోడ్ల పక్కన పేరుకుపోయిన సంచులు, చెత్తలో పడేసిన సీసాలు, కాలువల్లో తేలియాడే వ్యర్థాలనే భావించేవాళ్లం. కానీ ఇప్పుడు సమస్య ఆ దశను దాటిపోయింది. ఐదు మిల్లీమీటర్ల కన్నా చిన్న ప్లాస్టిక్ రేణువులను 'మైక్రోప్లాస్టిక్స్'గా పరిగణిస్తారు. పెద్ద ప్లాస్టిక్ వస్తువులు కాలక్రమేణా విచ్ఛిన్నం కావడం, వాహన టైర్ల రాపిడి, సింథటిక్ దుస్తుల నుంచి విడిపోయే సూక్ష్మ తంతువులు, ప్యాకేజింగ్ వ్యర్థాలు వీటి ప్రధాన మూలాలు. సముద్రాల నుంచి మంచు ప్రాంతాల వరకు, తాగునీటి నుంచి మన శరీర కణజాలాల వరకు వీటి ఆనవాళ్లు కనిపిస్తుండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం ఎంత వేగంగా పెరిగిందో గణాంకాలే చెబుతున్నాయి. 2000లో 234 మిలియన్ టన్నులుగా ఉన్న వార్షిక ప్లాస్టిక్ వినియోగం 2019 నాటికి 460 మిలియన్ టన్నులకు చేరింది. అదే ఏడాది ప్రపంచవ్యాప్తంగా 353 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థం ఉత్పత్తి కాగా, వాస్తవంగా పునర్వినియోగమైనది కేవలం 9 శాతం మాత్రమే. సుమారు 22 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ పర్యావరణంలోకి లీకైనట్లు అంచనాలు చెబుతున్నాయి. అంటే మనం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్‌లో పెద్ద భాగం చివరకు నేల, నీరు, గాలి రూపంలో తిరిగి మన జీవన చక్రానికే చేరుతోంది.భారత్‌కూ ఇది తీవ్రమైన హెచ్చరిక. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం 2021--22లో దేశంలో సుమారు 39 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థం ఉత్పత్తైంది. గంగా నదిపై 2025లో వెలువడిన ఒక అధ్యయనంలో ఎగువ హిమాలయ ప్రాంతంలోని నీటిలో లీటరుకు 100 నుంచి 1,550 వరకు మైక్రోప్లాస్టిక్ కణాలు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి ప్రాంతంలో బాటిల్ నీటిపై 2024లో నిర్వహించిన అధ్యయనం సగటున లీటరుకు 2.89 మైక్రోప్లాస్టిక్ కణాలను గుర్తించింది. సమస్య సముద్రాల్లో మాత్రమే లేదని, మనం తాగే నీటి వరకూ చేరిందని ఈ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.ఇంకా ఆందోళన కలిగించే అంశం మానవ శరీరంలో వీటి ఉనికి. రక్తం, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, ప్లాసెంటాలో కూడా మైక్రోప్లాస్టిక్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు వివిధ పరిశోధనలు సూచిస్తున్నాయి. 2024లో ప్రచురితమైన ఒక ప్రముఖ వైద్య అధ్యయనంలో పరిశీలించిన 257 మంది రోగుల్లో 150 మంది ధమనుల ప్లాక్‌లో పాలిథిలీన్ గుర్తించారు. ఆ సమూహంలో గుండెపోటు, స్ట్రోక్ లేదా మరణం సంభవించే ప్రమాదం ఎక్కువగా కనిపించింది. అయితే ఇది సంబంధాన్ని మాత్రమే చూపిన పరిశీలనా అధ్యయనం. మైక్రోప్లాస్టిక్స్ నేరుగా వ్యాధికి కారణమని తేల్చేందుకు ఇంకా మరింత శాస్త్రీయ పరిశోధన అవసరం.అయితే పూర్తి ఆధారాల కోసం ఎదురుచూస్తూ చర్యలను వాయిదా వేయడం కూడా సమంజసం కాదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించడం, ఉత్పత్తిదారుల బాధ్యతను కఠినంగా అమలు చేయడం, వ్యర్థాలను వేరు చేసి సేకరించే వ్యవస్థను విస్తరించడం, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని పెంచడం అత్యవసరం. వస్త్ర, టైర్ పరిశ్రమల నుంచి విడుదలయ్యే సూక్ష్మ కణాలకు ప్రత్యేక ప్రమాణాలు రూపొందించాలి. తాగునీరు, నదులు, ఆహార పదార్థాల్లో మైక్రోప్లాస్టిక్స్‌ను గుర్తించే జాతీయ స్థాయి పర్యవేక్షణ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.ప్లాస్టిక్ సంచి కనిపిస్తే తీసేయవచ్చు. సీసా కనిపిస్తే చెత్త బుట్టలో వేయవచ్చు. కానీ నీటిలో, గాలిలో, ఆహారంలో కలిసిపోయిన సూక్ష్మ ప్లాస్టిక్‌ను తిరిగి వేరు చేయడం అంత సులభం కాదు. మైక్రోప్లాస్టిక్స్ సమస్య భవిష్యత్తులో రావాల్సిన ప్రమాదం కాదు; మన వినియోగ సంస్కృతి ఇప్పటికే మన శరీర ద్వారం తట్టుతున్న హెచ్చరిక. కనిపించని కాలుష్యాన్ని కనిపించనట్టే వదిలేస్తే, దాని మూల్యం పర్యావరణమే కాదు---మన ఆరోగ్యం, మన పిల్లలు, రాబోయే తరాలు చెల్లించాల్సి వస్తుంది.

సి.హెచ్. ప్రతాప్
బాచిలర్స్ ఇన్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్ (ఉస్మానియా)
ఫ్లాట్ నెంబర్: 405, శ్రీ బాలాజీ డిలైట్స్
రాహుల్ కాలనీ, ఏ.ఎస్. రావు నగర్
సాయి సుధీర్ కాలేజీ వద్ద
హైదరాబాద్ -- 500 062

# పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో చూస్తున్నాం



**మొదటిపేజీ తరువాయి -** వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంచాం. పేదల జీవన ప్రమాణాన్ని పెంచే దిశగా పనిచేస్తున్నాం. గడిచిన రెండేళ్లుగా ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. నాలుగో శనివారం ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టు నిర్వహిస్తున్నాం.పేదల సేవలో పాల్గొనటమే నాకు ముఖ్యం. డ్వాక్రా సంఘాలను శక్తిమంతమైన మహిళలుగా తయారు చేస్తున్నాం. 5 లక్షల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తున్నాం. రాష్ట్రంలో మత్స్యకారులు, ఆటో డ్రైవర్లను ఆదుకుంటాం.వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం ఫేజ్-1 పూర్తిచేసి కృష్ణా నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను రూ.35,000 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేస్తామన్నారు. సంకల్పంతో ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. దీంతో రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని వెల్లడించారు. హంద్రీనీవా ఫేజ్-1 పనులు పూర్తిచేసి కరవు ప్రాంతంలో రిజర్వాయర్లు నింపామని వివరించారు. మార్కాపురం కరవు ప్రాంతం ఎప్పటికీ బాగుపడదని అనుకున్నారని చెప్పారు. 30 ఏళ్లకు ముందు వెలిగొండకు తానే శంకుస్థాపన చేశానని, తానే ఫేజ్-1 పూర్తి చేశానని తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవస్వామికి కృష్ణమ్మ జలాలు తీసుకొచ్చామని అన్నారు."పోర్టులు, హార్బర్‌లు, ఎయిర్‌పోర్టులు పూర్తిచేస్తున్నాం. రాయలసీమను రతనాలసీమ చేస్తామని చెప్పాం చేసి చూపిస్తున్నాం. సిమెంట్ రోడ్లు వేస్తాం, పంచాయతీ రోడ్లు బాగు చేస్తాం. గత ప్రభుత్వం గుంతలు తవ్వింది, మేము పూడుస్తున్నాం. ఎక్కడైనా గుంతలు కనిపిస్తే అధికారులే బాధ్యత వహించాలి. ఎక్కడ చూసినా గుంతలు లేని రహదారులు కనపడాలి. అత్యవసరం కింద రోడ్డు డాక్టర్‌ను తీసుకొస్తున్నాం. రోడ్డుపై గుంతలు కనిపిస్తే వెంటనే పూడ్చేలా ఏర్పాట్లు. సంక్షేమంతో సామాజిక భద్రత అభివృద్ధితో సంపద సృష్టి సాధ్యం. సుపరిపాలనతో నాణ్యమైన, మెరుగైన జీవనం తథ్యం. అభివృద్ధిలో పోటీతత్వం ఉండాలి కుట్రలు కాదు.గత వైఎస్సార్సీపీ సర్కార్‌లో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయారని, కూటమి ప్రభుత్వంలో వారంతా ఏపీకి క్యూ కడుతున్నారని చంద్రబాబు అన్నారు. రేపల్లెకు వస్తే కొత్త టానిక్ తీసుకున్నంత బలంగా ఉందన్నారు. 'మీ నమ్మకమే మాకు వెయ్యి ఏనుగుల బలం' అని తెలిపారు. ప్రజల దెబ్బకు రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా పోయిందని చెప్పారు. ప్రజల దెబ్బతో జగన్ అలిగాడని అసెంబ్లీకే రానంటున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలే తమకు ప్రతిపక్ష మని వివరించారు. ఇటీవల కొన్ని సర్వేల్లో చూశామని, వైఎస్సార్సీపీ గ్రాఫ్ పడిపోతోందని సీఎం వ్యాఖ్యానించారు.'చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నా. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నా. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఈ సందర్భగా అనగాని సత్యప్రసాద్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. భూసమస్యలను అనగాని శాశ్వతంగా పరిష్కరిస్తున్నారని' చంద్రబాబు వివరించారు.

# ఏపీలో 15,602 ఫ్యాక్టరీలు, దేశంలో 6వ స్థానం

**మొదటిపేజీ తరువాయి -** మొత్తం కర్మాగారాల్లో ఏపీలో 15,602 ఉన్నాయని పేర్కొంది. అత్యధిక కర్మాగారాలు ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు 41,221తో మొదటి స్థానంలో ఉంది. గుజరాత్ 33,084 పరిశ్రమలతో రెండో స్థానంలో ఉండగా, మహారాష్ట్ర 27,879 కర్మాగారాలతో మూడో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్, హరియాణా తర్వాతి స్థానాల్లో ఉండగా 13,937 కర్మాగారాలతో తెలంగాణ ఏడో స్థానంలో నిలిచింది.దేశంలో తయారీ రంగం 2024-25లో గణనీయమైన వృద్ధిని సాధించిందని వార్షిక సర్వే వెల్లడించింది. ఇక 2023-24తో పోలిస్తే పారిశ్రామిక ఉత్పత్తి 7.81 శాతం, ఉపాధి 7.19 శాతం, వేతనాలు 12.08 శాతం, మూలధన పెట్టుబడులు 11.10 శాతం, నికర ఆదాయం 9.68 శాతం పెరిగాయి. నికర లాభంలోనూ 7.73 శాతం వృద్ధి నమోదయిందని నివేదిక పేర్కొంది.బేసిక్ మెటల్స్, మోటారు వాహనాలు, రసాయనాలు, రసాయన ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు దేశ తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయి. ఈ రంగాలు మొత్తం తయారీ రంగ స్థూల విలువ జోడింపులో (జీవీఏ) 45 శాతానికి పైగా వాటాను అందించాయి.తయారీ రంగంలో ఉపాధి కల్పనలో తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, హరియాణా రాష్ట్రాలు దేశంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. దేశ తయారీ రంగం ద్వారా లభించిన మొత్తం ఉపాధిలో ఈ ఐదు రాష్ట్రాల వాటా 56 శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా 2023-24లో 2.60 లక్షల సంస్థలు, ఫ్యాక్టరీలు ఉండగా, 2024-25 నాటికి వాటి సంఖ్య 2.67 లక్షలకు పెరిగినట్లు ఎంవోఎస్‌పీఐ నివేదిక పేర్కొంది.ఇదిలా ఉండగా మరోవైపు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలో ఏపీ ఏడో స్థానాన్ని దక్కించుకుంది. 2025-26లో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఇటీవల గణాంకాలు విడుదల చేశారు. ఆ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు సుమారు రూ.39.04 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను వివిధ దేశాలకు ఎగుమతి చేశాయి.అందులో ఏపీ నుంచి రూ.1.77 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులు ఉన్నట్లు డీజీఎఫ్‌టీ నివేదికలో పేర్కొంది. దేశంలోని మొత్తం ఎగుమతుల్లో రాష్ట్రం వాటా 4.57 శాతంగా ఉందని తెలిపింది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మొత్తం ఎగుమతుల్లో 3.18%తో తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది.

# మరో 15 రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు రాక

**మొదటిపేజీ తరువాయి -** శాఖ కమిషనర్ చంద్రమోహన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈశాన్య రుతుపవనాలకు సంబంధించి ఐఎండీతో కలిసి చెన్నై వాతావరణ శాఖ ఇలాంటి సమావేశాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి.ఈ కార్యక్రమంలో ఐఎండీ చీఫ్ మహాపాత్ర కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 15- 21 మధ్య ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది. అదే సమయంలో నైరుతి రుతుపవనాలు మరో 2-3 రోజుల్లో ముగియనున్నాయి. ఈశాన్య రుతుపవనాల కాలంలో దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సాధారణ వర్షపాతం నమోదవుతుంది. దక్షిణ తమిళనాడు, దక్షిణ కేరళలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ నెలలో దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, కేరళలోని కొండ ప్రాంతాల్లో సాధారణ లేదా సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. నవంబర్ చివరి వరకు ఎల్ నినో ప్రభావం బలంగా ఉంటుంది. రుతుపవనాల సమయంలో దక్షిణ ద్వీపకల్పంలోని చాలా ప్రాంతాలలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం చాలా బలంగా ఉంది. ఇది నవంబర్ చివరి వరకు బలంగా ఉండి, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పడుతుంది. అయితే ఈ ఎల్ నినో ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చు." అని మహాపాత్ర వ్యాఖ్యానించారు.ప్రస్తుతం ఎల్ నినో తటస్థ స్థితిలో ఉందన్నారు ఐఎండీ చీఫ్ మహాపాత్ర. అయితే రాబోయే కొద్ది నెలల్లో పాజిటివ్ దశకు మారుతుందని అంచనా వేశారు. తుపానుల దక్షిణ దిశగా ఏర్పడతాయని పేర్కొన్నారు. దీంతో దక్షిణ ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ వంటి దక్షిణ ప్రాంతాలపై తుపాను ప్రభావం తక్కువగా ఉంటుందన్నారు. వాతావరణ పరిస్థితులపై 2021 నుంచి ఐఎండీ కచ్చితమైన అంచనాలను వేస్తోందని చెప్పారు. 2016--2020 కాలంలో వాతావరణ శాఖ అంచనాల్లో లోపం 7.9 శాతంగా ఉండగా, 2021--2025 కాలంలో అది 2.2 శాతానికి తగ్గిందని గుర్తు చేసుకున్నారు. ఇది అంచనాల కచ్చితత్వంలో గణనీయమైన పెరుగుదలను సూచిస్తుందని అన్నారు.ప్రకృతి వైపరీత్యాలను మనం పూర్తిగా నివారించలేక పోయినప్పటికీ సరైన స్పందన, ముందస్తు జాగ్రత్తల ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ చంద్రమోహన్ అభిప్రాయపడ్డారు. సమీకృత ప్రణాళిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వివిధ రంగాల ఉమ్మడి కృషి కారణంగా గతంతో పోలిస్తే తమిళనాడులో విపత్తుల తీవ్రత క్రమంగా తగ్గిందని గుర్తు చేశారు. రుతుపవనాల సన్నద్ధత చర్యలకు వాతావరణ సూచనలే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. గత 150 ఏళ్లలో భారత వాతావరణ శాఖ తన సూచనా సామర్థ్యాలను ఎంతో మెరుగుపరచుకుందన్నారు. ముఖ్యంగా ఇప్పుడు గ్రామ స్థాయి వరకు కూడా కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించే స్థాయికి చేరుకుందని కొనియాడారు. "తమిళనాడు డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ఏజెన్సీ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,400 ఆటోమేటిక్ వర్షమాపక యంత్రాలను, 100కు పైగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ ఏడాది మరో 1,000 వర్షమాపక యంత్రాలను ఏర్పాటు చేయనున్నాం. అలాగే భవిష్యత్తులో ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక వర్షమాపక యంత్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈ సాంకేతికత సహాయక, పునరావాస చర్యలను ముందుగానే ప్రణాళిక చేసుకోవడంలోనూ, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడంలోనూ ఉపయోగపడుతుంది. ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కొనేందుకు తమిళనాడు సీఎం విజయ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో క్రమం తప్పకుండా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. " అని చంద్రమోహన్ స్పష్టం చేశారు.

# సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల ప్రథమ లక్ష్యం కావాలి

**మొదటిపేజీ తరువాయి -** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పేదల ఆవేదన అర్థం చేసుకునే మనసు ప్రతి ఉద్యోగికి ఉండాలని చెప్పారు. దేశం క్రమంగా పట్టణీకరణ వైపు ప్రయాణిస్తున్న తరుణంలో, ఆ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఏఐని సమర్థంగా వాడుకోవాలని సూచించారు. సివిల్ సర్వీస్ ఎంపిక ప్రక్రియను ఆధునీకరించాలని, ఉద్యోగుల సెల్ఫ్ అప్రైజల్ పద్ధతిని ప్రోత్సహించాలని చెప్పారు. గురువారం దిల్లీలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న మోదీ ఈ మేరకు ప్రసంగించారు. ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో కోపైలట్ దాడి చేసినా ప్రాణాలకు తెగించి ప్రయాణికులను కాపాడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ గురించి మోదీ ప్రస్తావించారు. స్మిత్ మచ్చర్ చూపిన ధైర్యసాహసాలను, సమయస్ఫూర్తిని మోదీ ప్రశంసించారు."ఇవాళ ప్రపంచమంతా స్మిత్ మచ్చర్‌ను చూసి గర్విస్తోంది. ఫ్లై దుబాయ్? ఘటనలో భారత కెప్టెన్ స్మిత్ అద్భుతమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన చూపిన శౌర్యం దేశంలోని ప్రతి పౌరుడికి గర్వకారణం. నిజానికి, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి చెప్పినట్లుగా, ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని నివారించారు. కెప్టెన్ స్మిత్ మచ్చర్ కుటుంబంతో మాట్లాడా. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. స్మిత్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని దేశ ప్రజలను కోరుతున్నా. అలాగే, భారతదేశానికి కీర్తి తెచ్చిన స్మిత్‌కు వందనం చేయాలని పిలుపునిస్తున్నాను.ప్రభుత్వ పదవులకు కాకుండా, ప్రజా సేవకు ఆకర్షితులయ్యే యువతను ప్రభుత్వ సేవల్లోకి తీసుకురావాలని మోదీ పేర్కొన్నారు. అందువల్ల, నియామక పరీక్ష కేవలం అభ్యర్థికి ఏమి తెలుసో మాత్రమే కాకుండా, సివిల్ సర్వీసెస్‌లోకి ఎందుకు రావాలనుకుంటున్నారో కూడా పరిశీలించడం చాలా ముఖ్యమన్నారు. అదే విధంగా, పరీక్షల నిర్వహణ, నియామక ప్రక్రియల్లో నిరంతర సంస్కరణలు చేపట్టాలని మోదీ పిలుపునిచ్చారు. పరీక్ష అనేది కేవలం ఒక ఈవెంట్ మాత్రమే కాదని, లక్షలాది మంది యువత భవిష్యత్తు దానితో ముడిపడి ఉందని మోదీ స్పష్టం చేశారు. పరీక్షల్లో కొన్ని నెలల ఆలస్యం జరిగినా అది యువతకు ఎంతో నష్టం కలిగిస్తుందని చెప్పారు. గత 100 ఏళ్ల ప్రయాణంలో దేశంలో తరాలు మారాయని, ప్రభుత్వాలు మారాయని, సాంకేతికత, సిలబస్‌లు కూడా మారిందని, అయితే, యూపీఎస్సీపై ఉన్న నమ్మకం మాత్రం చెక్కు చెదరలేదని కొనియాడారు. ప్రతి ఏటా లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశప్రజల నమ్మకానికి యూపీఎస్సీ ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఆ నమ్మకమే యూపీఎస్సీకి ఉన్న అతిపెద్ద ఆస్తి మోదీ స్పష్టం చేశారు.మరోవైపు, 2047 నాటికి దేశంలో భిన్నమైన మార్పులు వస్తాయని, అప్పటికి భారత్? పూర్తి పట్టణీకరణ చెంది ఉంటుందని మోదీ పేర్కొన్నారు. ఫలితంగా గ్రామాలు, నగరాల మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గుతుందని చెప్పారు. అలాగే, పౌరులు ముఖ్యంగా నేటి తరం యువత ఆలోచనలు, వారి ఆశయాలు చాలా భిన్నంగా ఉన్నాయని, పాత పద్ధతులను ఎవరూ ఆశించడం లేదని చెప్పారు. దేశం, ప్రభుత్వం నుంచి వారు అత్యున్నత స్థాయి సేవలను, వేగవంతమైన వృద్ధిని ఆశిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత రోజులను గమనిస్తే, ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. అయితే, ప్రపంచ వేగానికి అనుగుణంగా ప్రభుత్వ సేవలు సాగుతున్నాయా, ఆ విధంగా పనిచేయగలుగుతున్నామా అనేది అసలు ప్రశ్న అని మోదీ అన్నారు. కాబట్టి, సేవలను అందించడం మాత్రమే ముఖ్యం కాదని, వాటిని ఎంత వేగంగా అందిస్తున్నామనేదే ముఖ్యమని చెప్పారు.

# ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు.. 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

**మొదటిపేజీ తరువాయి -** దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది.అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది.మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

# ఆసియా క్రీడల్లో నాయుడుపేట కుర్రాడి సత్తా

**మొదటిపేజీ తరువాయి -** కొనియాడారు.ఐచి-నగోయా ఆసియా క్రీడల్లో భాగంగా జరిగిన కాంస్య పతక పోరులో గణేశ్ సత్తా చాటాడు. వియత్నాంకు చెందిన కాంగ్ దక్ డాంగ్‌పై 149--144 పాయింట్ల తేడాతో అతడు విజయం సాధించి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంతకుముందు, పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టులోనూ గణేశ్ కీలక పాత్ర పోషించడం విశేషం. ఇప్పుడు వ్యక్తిగత విభాగంలోనూ పతకం సాధించి తన అద్భుత నైపుణ్యాన్ని మరోసారి ప్రదర్శించాడు.గణేశ్ తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందినవాడు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. గణేశ్ ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప గౌరవాన్ని తెచ్చిపెట్టాడని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి మరిన్ని గొప్ప విజయాలు అందించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ

**మొదటిపేజీ తరువాయి -** పథకాన్ని వచ్చే నెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశముంది. పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో విలీనానికి సంబంధించి కేశవరావు కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. నిషేధిత భూముల జాబితా నుంచి ఊరట కలిగించే అంశాలు, నూతన పెన్షన్లు, రాజీవ్ యువ వికాసం, హైదరాబాద్ మెట్రో, మూసీ ప్రాజెక్టు, ఆర్‌ఆర్‌ఆర్, ఇందిరమ్మ చీరల పంపిణీపైనా చర్చించే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాల సవరణపై కేబినెట్ సమాలోచనలు చేస్తుందని సమాచారం.

# రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

**మొదటిపేజీ తరువాయి -** ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

# భూమికి పెరుగుతున్న ముప్పు



**మొదటిపేజీ తరువాయి -** భూమి మనుషుల నివాసానికి అనుకూలంగా ఉండే సురక్షిత పరిమితులను వేగంగా దాటుతోంది. భూమిని నిలకడగా ఉంచే 9 కీలక వ్యవస్థల్లో ఏకంగా 7 వ్యవస్థలు ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటినట్లు తాజా శాస్త్రీయ అధ్యయనం వెల్లడించింది. 60 మందికి పైగా శాస్త్రవేత్తలు నిర్వహించిన 2026 ప్లానెటరీ హెల్త్ చెక్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.వాతావరణ మార్పులు, జీవ వైవిధ్యానికి నష్టం, భూ వినియోగంలో మార్పులు, మంచినీటి వ్యవస్థల్లో మార్పులు, నైట్రోజన్-ఫాస్ఫరస్ వంటి రసాయన చక్రాల్లో అసమతుల్యత, ప్లాస్టిక్-సింథటిక్ రసాయనాల కాలుష్యం, సముద్రాల ఆమ్లీకరణ.. ఈ ఏడు అంశాల్లో భూమి సురక్షిత పరిమితులను దాటింది. గత అంచనాలతో పోలిస్తే సముద్రాల ఆమ్లీకరణ కూడా తొలిసారి ఈ జాబితాలో చేరింది.మిగిలిన రెండు వ్యవస్థల్లో స్ట్రాటోస్ఫియరిక్ ఓజోన్ పొర పరిస్థితి మెరుగుపడినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే వాతావరణంలో ఉండే సూక్ష్మ కాలుష్య కణాలు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ తీవ్ర సమస్యగా ఉన్నాయి.2009లో శాస్త్రవేత్తలు 'ప్లానెటరీ బౌండరీస్' విధానాన్ని రూపొందించారు. మానవాళి సురక్షితంగా జీవించగలిగే భూమి పరిమితులను గుర్తించడం దీని ఉద్దేశం. ఈ పరిమితులను దాటడం అంటే వెంటనే విపత్తు వస్తుందని కాదు. కానీ, తిరిగి వాటిని పునరుద్ధరించడం కష్టంగా మారి దీర్ఘకాలంలో ముప్పుగా మారుతుందని అర్థం.అమెజాన్ అడవుల పరిస్థితిపైనా శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. భారీగా కార్బన్‌ను నిల్వ చేసే ఈ అడవులపై ఒత్తిడి పెరుగుతుండటంతో భవిష్యత్తులో కీలక మార్పులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. దాని ప్రభావం వాతావరణ స్థిరత్వం, ఆహారం, నీటి భద్రతపై పడొచ్చని పేర్కొన్నారు.అయితే పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోలేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను వేగంగా తగ్గించడం, అడవులు, సముద్రాలు, మంచినీటి వ్యవస్థలను రక్షించడం ద్వారా భూమిని మళ్లీ సురక్షిత పరిమితులకు దగ్గర చేయవచ్చని నివేదిక తెలిపింది.

# మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు.సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
శుక్రవారం 02 - 10 - 2026

## మేడిగడ్డ తండా పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా టైలు, షూస్ పంపిణీ

**విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా సేవా కార్యక్రమం డిప్యూటీ సర్పంచ్ రమేష్ నాయక్,వార్డ్ సభ్యులు శంకర్ నాయక్**



బాలానగర్, **అక్టోబర్ 01 ( తొలివార్త ):** మేడిగడ్డ తండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా టైలు, షూస్ పంపిణీ చేసి విద్యార్థుల పట్ల తమకున్న ఆప్యాయతను చాటుకున్నారు. డిప్యూటీ సర్పంచ్ శ్రీ రమేష్, వార్డు మెంబర్ శ్రీ శంకర్ విద్యార్థులకు ఉచితంగా టైలు, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన వారు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, విద్యపై ఆసక్తి పెంచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే విధంగా సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. “నేటి విద్యార్థులే రేపటి సమాజానికి మార్గదర్శకులు. వారి చదువుకు, అభివృద్ధికి అందించే ప్రతి చిన్న సహాయం వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుంది” అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా టైలు, షూస్ అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేపలగడ్డ అంగన్వాడీ కేంద్రం అభివృద్ధికి

**ఐటీసీ హెచ్ఆర్ శ్యామ్ కిరణ్ కి వినతి పత్రం అందజేసిన**

**సర్పంచ్ బొల్లి నిరోషా**



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 01 ( తొలివార్త ):** వేపలగడ్డ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించే ఉద్దేశంతో ప్రహరీ గోడ నిర్మాణం, ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని కోరుతూ ఐటీసీ సంస్థ ప్రతినిధులకు హెచ్ ఆర్ శ్యామ్ కిరణ్ కి వేపలగడ్డ సర్పంచ్ బొల్లి నిరోషా వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేకపోవడంతో భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే చిన్నారుల సౌకర్యార్థం ఫ్లోరింగ్ పనులు అవసరమని వివరించారు. ఈ పనులకు అవసరమైన సహకారం అందించి అంగన్వాడీ కేంద్రాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లి నిరోష , సర్పంచ్,వేపలగడ్డ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.వేపలగడ్డ అంగన్వాడీ కేంద్రం అభివృద్ధికి

## తుఫాను బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల కోసం

**ఎంపీడీఓ జమలారెడ్డి కి వినతి పత్రం అందజేసిన**

**వేపలగడ్డ సర్పంచ్ బొల్లి నిరోషా**



భద్రాద్రి జిల్లా బూర్గంపాడు **అక్టోబర్ 01 ( తొలివార్త ):** వేపలగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో వేపలగడ్డ గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం వచ్చిన ( తుఫాన్ )ఈదురుగాలి కారణంగా గ్రామంలో ని ఇల్లు కూలి పోవడంతో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీఓ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇల్లు లేని నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొల్లి నిరోష ,కార్యదర్శి కిరణ్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో స్వచ్ఛతా కార్యక్రమం

**ఐటీసీ డబ్ల్యు ఎ ఎస్ హెచ్, ఐటీసీ ఎన్జీవో సంస్థల ఆధ్వర్యంలో శ్రమదానం**

**ఎంపిడబ్ల్యు సిబ్బందికి ఘన సన్మానం**

**సర్పంచ్ తాటి వాణి, ఉప సర్పంచ్ మోహనరావు**







**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 01 ( తొలివార్త ):** బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ తాటి వాణి ఉప సర్పంచ్ మోహన్ రావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఐటీసీ డబ్ల్యు ఎ ఎస్ హెచ్ మరియు ఇతర ఐటీసీ ఎన్ జి ఓ ల ప్రతినిధులు, గ్రామస్తులు కలిసి శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పలు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వి.బి.జి. రామ్‌జీ ఆధ్వర్యంలో మ్యాప్‌ను రూపొందించి గ్రామస్తులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పరిశుభ్రత, పారిశుధ్యం, పరిసరాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కృష్ణసాగర్ గ్రామపంచా యతీలో సేవలందిస్తున్న ఎంపిడబ్ల్యు వర్కర్లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామ పారిశుధ్యం, ప్రజారోగ్య పరిరక్షణలో వారు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఐటీసీ డబ్ల్యు ఏ ఎస్ హెచ్,ఇతర ఐటిసి ఎన్జీవో ల ప్రతినిధులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సెక్రటరీ, పంచాయతీ సిబ్బంది, ఎంపీడబ్ల్యు వర్కర్లు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలను నియమనిష్టలతో, ప్రశాంతంగా జరుపుకోవాలి

**డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**



**పాల్వంచ అక్టోబర్ 01 ( తొలివార్త ):** ఈనెల 1 నుండి జరుపుకునే అమ్మవారి శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలను నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పనులు ప్రారంభించడానికి నిర్వాహకులు కర్ర పూజలి కార్యక్రమం నిర్వహించారు. పాల్వంచ పట్టణ పరిధిలోని శివనగర్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ దుర్గాసేవా సమితి ఆధ్వర్యంలో, పాల్వంచ భజన మందిరం రామాలయం వద్ద జై దుర్గాభవాని ఆధ్వర్యంలో జరిగిన కర్ర పూజా కార్యక్రమాల్లో డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ,దుర్గామాత పూజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. అమ్మ దయ ఉంటే లోకానికంతటికీ శుభం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు కిరణ్, దేవరకట్ల శంకర్ రావు, దేవరకట్ల విజయలక్ష్మి, కార్పొరేటర్ సీరపు సుగుణ, నిర్వాహకులు సంతోష్‌రెడ్డి (బబ్లూ), చింతా నాగరాజు, ధన్ రాజ్, కేశబోయిన కోటేశ్వరరావు, చిప్పా పెద్దసత్యం, చిప్పా చిన్న సత్యం, గణేష్, బాలకృష్ణ, సాయికృష్ణ, చిప్పా పవన్ కళ్యాణ్, చిప్పా భార్గవ్, చిప్పా జంపన్న, యండి.యూనస్, బాబా, ఫయాజ్, చిలకా రాహుల్, వేణు, మనీశ్వర రావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 01 ( తొలివార్త ):** మణుగూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలు మరియు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను, అలాగే 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ చెక్కులను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందని, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అదేవిధంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకం ద్వారా 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వివాహ సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటీ రామారావు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, సివిల్ సప్లై అధికారి, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీతకు ఘన సత్కారం

**ఎస్ఐఆర్ ఫేజ్--2 విజయవంతానికి కృషి చేయాలి**

**బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి**

**కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలి.**



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 01 ( తొలివార్త ):** బూర్గంపాడు మండలం అంజనాపురంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్ కరణం పరిణీత కు ఘన సన్మానం నిర్వహించారు. అంజనాపురంలోని బీజేపీ సీనియర్ నాయకుడు భూక్యా సీతారాం నాయక్ నివాసానికి కరణం పరిణీత విచ్చేయడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బంజారా మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్యా దివ్యశ్రీ, భూక్యా సీతారాం నాయక్ కలిసి కరణం పరిణీతను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కరణం పరిణీత మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఫేజ్--2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఓటర్లకు ఎస్ఐఆర్‌కు సంబంధించి ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసి, ప్రక్రియపై పూర్తి సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కరణం పరిణీత సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుడగం రవికుమార్, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మణ్, దున్నపోతుల రాజు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ బాలకృష్ణ బాలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన కరకగూడెం ఎస్సై నాగేశ్వరరావు



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 01 ( తొలివార్త ):** కరకగూడెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మలకుర్తి బాలక్రిష్ణ(బాలు) ఇటీవల అనారోగ్యంతో,మరణించారు.ఆయన మృతితో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది.ఈ నేపథ్యంలో బాలు దిశదిన కర్మల (దినవారాల) ఖర్చుల నిమిత్తం పలువురు మానవత్వాన్ని,చాటుకున్నారు.కరకగూడెం ఆటో యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 5,000/- ఆర్థిక సహాయాన్ని,అందజేశారు.అలాగే కరకగూడెం మండల ఎస్సై నాగేశ్వర రావు సైతం తన ఉదారతను చాటుకుంటూ బాలు కుటుంబ సభ్యులకు రూ. 5,000/- నగదును ఆర్థిక సహాయంగా అందజేసి,బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను, పరామర్శించారు.ఈ కష్టసమయంలో తమకు అండగా నిలిచిన ఆటో యూనియన్ సభ్యులకు, ఎస్సై నాగేశ్వర రావుకు బాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు కొమరం సాంబశివరావు,గుడ్ల రంజిత్ కుమార్,నిట్టా సౌందర్యరావు,బెజవాడ రాములు,బాదె సాగర్,కొలగాని రవి,యజ్జు సాయి,తోలెం రవి,బంధు సతీష్,నిట్టా సాయి,తోట శివ,నిట్టా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసిల్దార్ సమ్మయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన

**బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 01 ( తొలివార్త ):** అశ్వాపురం మండల డిప్యూటీ తహసిల్దార్ గా సమ్మయ్య ఇటీవల బాధ్యతలు చేపట్టారు. సమ్మయ్య ను గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి శాలువాతో సత్కరించి డిప్యూటీ తహసిల్దార్ కి శుభాకాంక్షలు తెలిపారు.గతంలో అశ్వాపురంలో సమ్మయ్య ఆర్ ఐ గా పనిచేసిన రోజులలో కొల్లు మల్లారెడ్డికి ఉన్న పరిచయాన్ని సమ్మయ్యతో పంచుకున్నారూ. ఈ కార్యక్రమంలో నెల్లిపాక బంజార మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంత వేడుకలు పాల్గొన్న సర్పంచ్ మచ్చ నరసింహారావు



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 01 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని మల్లెల మడుగు ఒకటవ,అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా ఇద్దరు గర్భిణీలకు శ్రీమంతం వేడుక, అంగన్వాడి టీచర్ రెడ్డి అరుణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో, ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ మచ్చ నరసింహారావు, పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలకు గాజులు పూలు పండ్ల తో ఒడి నింపి వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రెడ్డి అరుణ ఆశా వర్కర్ ఎం సుశీల మండల ఎంఎంఎస్ అధ్యక్షురాలు కుంజ సునీత గర్భిణీలు బాలింతలు తల్లులు గ్రామస్తులు మహిళా సోదరీమణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి అరుణ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తీసుకునే ఆహారంపై, వారికి అవగాహన తెలియజేస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని చిరుధాన్యాలను వాడాలని తల్లులకు ఆమె సూచించారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి






**భువనగిరి, అక్టోబర్ 01 ( తొలివార్త ):** సైబర్ భద్రత అవగాహన మాసం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గురువారం భువనగిరి పట్టణంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శనాత్మక నడక, ప్రజా ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఎస్పీ రవీందర్ నాయకత్వం వహించారు. భువనగిరి పట్టణ సీఐ రమేష్, గ్రామీణ సీఐ చంద్రబాబు, ఎస్ఐలు అనిల్, లక్ష్మీనరసయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పత్రికా, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకసారి వినియోగించే సంకేత సంఖ్య, వ్యక్తిగత గుర్తింపు సంఖ్య, కార్డు భద్రతా సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలు, సంకేతపదాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. అనుమానాస్పద అనుసంధానాలు, ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ అంతర్జాల పేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు కలిసి సైబర్ నేరాల నివారణ, వ్యక్తిగత సమాచార భద్రత, డిజిటల్ సాంకేతికతను సురక్షితంగా వినియోగించడంపై ప్రజా ప్రతిజ్ఞ చేశారు. “ఆలోచించి నొక్కండి -- ధృవీకరించి స్పందించండి -- సురక్షితంగా ఉండండి” అనే సందేశంతో ప్రజల్లో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు.

## “అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం.. మీర్పేట్‌లో కూల్చివేతలు”

**బినాచారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేతలు**



**అక్టోబర్ 01 ( తొలివార్త ):** నాచారం సర్కిల్ పరిధిలోని మీర్పేట్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలను గుర్తించిన అధికారులు ప్రత్యేక బృందాలతో కూల్చివేత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నాచారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కె. కళ్యాణి రాణి, టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ నేతృత్వం వహించారు. అనుమతులు లేకుండా లేదా మంజూరైన ప్రణాళికలకు విరుద్ధంగా నిర్మించిన భాగాలను యంత్రాల సహాయంతో తొలగించారు.నగరాభివృద్ధి, ప్రజా భద్రత దృష్ట్యా అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. భవన నిర్మాణాలకు ముందు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, నిబంధనలను పాటించాలని ప్రజలకు సూచించారు.కూల్చివేత కార్యక్రమంలో చైన్‌మన్ ఎల్లయ్య, బాబు తదితర టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొని అధికారులకు సహకరించారు. నాచారం సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## నాగమణి కి వైద్య ఖర్చులకు రూ.5 లక్షల విలువైన ఎల్ ఓ సి ని అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 01 ( తొలివార్త ):** అశ్వాపురం మండల కేంద్రంలోని బుడుగు బజార్,కు చెందిన నిరుపేద కుటుంబమైన రాంపూడి నాగమణికి వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ ని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, వారి కుటుంబానికి అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాగమణి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పాటునందించనుంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరికీ వైద్య చికిత్స ఆగిపోకూడదనే ఉద్దేశంతో అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా ఎమ్మెల్యే భరోసా కల్పిస్తూ పేద కుటుంబాల పట్ల చొరవ తీసుకుంటున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ,ఉంటూ,వారి,సమస్యలను, పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగమణి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యాభివృద్ధికి దివిస్ సేవలు అభినందనీయం

**సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**






**చౌటుప్పల్, అక్టోబర్ 01 ( తొలివార్త ):** చౌటుప్పల్ మండల పరిధిలోని గ్రామాల్లో నిరుపేదల విద్యాభివృద్ధికి పరిశ్రమ చేస్తున్న కృషి అభినందనీయమని దేవాలమ్మా నాగారం సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలోని మండల పరిషత్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం దివిస్ పరిశ్రమ సహకారంతో రూ.50,53,560ల విలువైన 1,25,270నోట్ పుస్తకాలను సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పరిసర గ్రామాల అభివృద్ధికి,నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దివిస్ పరిశ్రమ సహకారం మరువలేనిదన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనూప్ రెడ్డి,వార్డ్ మెంబర్ అమరావతి,చైర్మన్ సుగుణమ్మ మరియు దివీస్ పరిశ్రమ ప్రతినిధులు,గోపి,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
శుక్రవారం 02 - 10 - 2026

# భక్తికి బాటలు.. ఆలయాల అభివృద్ధికి చేయూత

**దసరా నాటికి సరికొత్త శోభను సంతరించుకోనున్న**
**చిన్నకొండూరు శ్రీ రామలింగేశ్వర దేవాలయం**
**సొంత నిధులతో పాటు దాతల సహకారంతో**
**శ్రీరాముల వారి ఆలయం,సుబ్రహ్మణ్యేశ్వర స్వామి**
**ఆలయం, ప్రహరీ గోడ,నవగ్రహాల మండపం నిర్మాణం**
**ఆలయ సేవలో ఆదర్శంగా నిలుస్తున్న**
**ఎరుకల సంధ్యా-రాందాస్ గౌడ్ దంపతులు**

**చౌటుప్పల్ అక్టోబర్ 01 ( తొలివార్త ):** భక్తి సంకల్పంగా మొదలై దంపతుల సేవా సంకల్పంగా మారితే ఆ ఫలితం తరతరాలకు నిలిచిపోతుంది.భర్త అడుగుజాడల్లో నడుస్తూ భార్య కూడా ఆధ్యాత్మిక సేవలో భాగస్వామిగా నిలుస్తూ,ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్న చిన్నకొండూరు శ్రీ రామలింగేశ్వర దేవాలయ అధ్యక్షులు ఎరుకల సంధ్యా-రాందాస్ గౌడ్ దంపతులు భక్తి సేవకు ఆదర్శంగా నిలుస్తున్నారు.చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో గర్భగుడి పక్కనే శ్రీ రాముల వారి ఆలయం,సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.వీటితో పాటు ఆలయ ప్రాంగణానికి ప్రహరీ గోడ,నవగ్రహాల మండపం నిర్మిస్తున్నారు.ఈ నిర్మాణ పనులకు ఎరుకల సంధ్యా-రాందాస్ గౌడ్ దంపతులు తమ సొంత నిధులను వెచ్చించడంతో పాటు దాతల సహకారాన్ని తీసుకుంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



**భర్త అడుగుజాడల్లో నడుస్తూ..**

ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల విషయంలో భర్త రాందాస్ గౌడ్ ముందుకు అడుగు వేస్తే.. ఆ అడుగులకు తోడుగా నిలుస్తూ భార్య ఎరుకల సంధ్య కూడా అదే సేవా మార్గంలో నడుస్తున్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు భక్తి, ఆధ్యాత్మిక సేవకు ప్రాధాన్యత ఇస్తూ భర్తకు అండగా నిలుస్తున్నారు. భర్త చేస్తున్న సేవా కార్యక్రమాలకు తోడుగా నిలుస్తూ,ఆలయాల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటూ "భర్త అడుగుజాడల్లో భార్య.. సేవా మార్గంలో దంపతులిద్దరూ"అనే విధంగా ఎరుకల సంధ్యా-రాందాస్ గౌడ్ దంపతులు ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.

**ఒక్క ఆలయానికే పరిమితం కాని సేవాభావం**

చిన్నకొండూరు శ్రీ రామలింగేశ్వర దేవాలయ అభివృద్ధితో పాటు పలు గ్రామాల్లోని దేవాలయాలకు కూడా ఎరుకల సంధ్యా-రాందాస్ గౌడ్ దంపతులు అనేక సందర్భాల్లో విరాళాలు అందిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరిస్తున్నారని స్థానికులు తెలిపారు.ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవను సామాజిక బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

**దసరా నాటికి సరికొత్త శోభ**

ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేసి దసరా పండుగ నాటికి ఆలయ అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలనే సంకల్పంతో ఎరుకల సంధ్యా--రాందాస్ గౌడ్ దంపతులు కృషి చేస్తున్నారు. శ్రీ రాముల వారి ఆలయం,సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, నవగ్రహాల మండపం,ప్రహరీ గోడ నిర్మాణాలు పూర్తయితే శ్రీ రామలింగేశ్వర దేవాలయ ప్రాంగణం మరింత సుందరంగా, )ఆధ్యాత్మిక శోభతో కళకళలాడనుంది. భర్త అడుగుజాడల్లో భార్య.. ఇద్దరి సంకల్పానికి దాతల సహకారం.. అందరి భాగస్వామ్యంతో ఆలయ అభివృద్ధి.. ఇలా భక్తి, సేవ, దాతృత్వాన్ని కలగలిపి ముందుకు సాగుతున్న ఎరుకల సంధ్యా--రాందాస్ గౌడ్ దంపతుల కృషి భక్తులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# వనస్థలిపురంలో సీఎంఆర్ షాపింగ్ మాల్

**ముఖ్య అతిథిగా సినీనటి మీనాక్షి చౌదరి సందడి**

**ఎల్బీనగర్, అక్టోబర్ 01 ( తొలివార్త ):** వస్త్ర వ్యాపార రంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నటువంటి నాణ్యత, విస్తృతమైన కలెక్షన్లు, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ తన నూతన షోరూమ్‌ను వనస్థలిపురంలో గురువారం ఘనంగా ప్రారంభించింది. నూతన షోరూమ్ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకటరమణ, డైరెక్టర్ మావూరి బాలాజీలతో కలిసి ఆమె షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీగౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, బీజేపీ నేత సామ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్, యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు పి.ఈశ్వరమ్మ యాదవ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, తొలి కొనుగోలుదారులు పి.కృష్ణయాదవ్, పి సురేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. అనంతరం మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో లభించే చీరల కలెక్షన్లు తనకు ఎంతో నచ్చుతాయని తెలిపారు. తాను కూడా క్రమం తప్పకుండా సీఎంఆర్ లో షాపింగ్ చేస్తుంటానని పేర్కొన్నారు. విభిన్నమైన డిజైన్లు, ఆకర్షణీయమైన కలెక్షన్లు సీఎంఆర్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయని ఆమె అన్నారు. వేదికపై మాట్లాడిన మీనాక్షి చౌదరి వనస్థలిపురం ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపుతున్నారని,



అదేవిధంగా తనకూ ఇక్కడి ప్రజలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. ఈ నూతన షోరూమ్ అందుబాటులోకి రావడంతో వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు మరింత విస్తృతమైన షాపింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అనంతరం వేదికపైనే పాటలకు నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరించడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

**ఒకే చోట కుటుంబమంతటికీ వస్త్ర ప్రపంచం**

నూతన సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో చీరలు, సంప్రదాయ దుస్తులు, పురుషులు, మహిళలు, చిన్నారుల వస్త్రాలతో పాటు విభిన్నమైన ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ కలెక్షన్లు అందుబాటులో ఉంచారు. అన్ని వయసుల వారికి, కుటుంబ సభ్యులందరికీ ఒకే చోట షాపింగ్ చేసేలా మాల్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను ఆకర్షణీయమైన ధరలకు అందించడంతో పాటు ప్రతి షాపింగ్ అనుభవాన్ని మధురమైన జ్ఞాపకంగా మార్చడమే తమ లక్ష్యమని తెలిపారు. వినియోగదారుల ఆదరణతో మరిన్ని ప్రాంతాలకు తమ సేవలను విస్తరిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.

**రూ.89కే ప్రింటెడ్ క్రేప్ సారీ.....**

ప్రారంభోత్సవ కానుకగా ప్రింటెడ్ క్రేప్ సారీ కేవలం రూ.89కే అందిస్తున్నట్లు సీఎంఆర్ యాజమాన్యం ప్రకటించింది. దీంతో పాటు అన్ని కేటగిరీల్లోనూ పలు ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. వనస్థలిపురంలో ప్రారంభమైన సీఎంఆర్ షాపింగ్ మాల్ స్థానిక ప్రజలకు కొత్త షాపింగ్ గమ్యస్థానంగా నిలవనుందని యాజమాన్యం పేర్కొంది. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలు నూతన షోరూమ్‌ను సందర్శించి విస్తృతమైన కలెక్షన్లను ఆస్వాదించాలని సీఎంఆర్ యాజమాన్యం కోరింది. ఈ సదవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సిఎంఆర్ యజమాన్యం సూచించారు.

# ప్రజా ప్రతినిధి అని మరిచిపోయిన గ్రామ సర్పంచ్

**పదహారేళ్ల బాలుడు పై దాడి చదువుకున్న విద్యార్థి పై ఫిర్యాదులు?**
**కేసుల నుండి తప్పించుకోవటానికి మాపై ఆరోపణలు మాజీ సర్పంచ్ భర్త రాందాసు.**

**సింగరేణి అక్టోబర్ 01 ( తొలివార్త ):** సింగరేణి మండలం భాగ్య తండా గ్రామపంచాయతీలో వినాయక నిమజ్జనం సందర్భంగా పదహారేళ్ళ బాలుడు పై గ్రామ సర్పంచ్ దాడి చేశారని బాధితుడు మరియు కాంట్రాక్టర్ రాందాస్ నాయక్ గ్రామస్తులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా సర్పంచ్ మద్యం సేవించి తనపై దాడి చేశారని బాలుడు మీడియా సమావేశంలో ఆరోపించాడు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు నిర్వహించారని నిమజ్జనం సందర్భంగా ఈ సంఘటన చోటుచేసుకుందని తెలిపాడు. సంఘటన అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీకి పిలిపించినప్పటికీ తాను హాజరు కావలసిన అవసరం లేదని తనపై ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పడంతో పోలీసులను ఆశ్రయించినట్లు బాలుడు తెలిపాడు. తలపై



జరిగిన దాడి ఘటన నుంచి దిష్టి మళ్లించేందుకే మాజీ సర్పంచ్ భర్త రామదాసు పై గ్రామ యువకులపై ఆరోపణలు చేస్తున్నారని బాలుడు పేర్కొన్నాడు.

**ఆరోపణలు ఖండించిన రాందాస్.**

బాలుడి ఆరోపణల పై మాజీ సర్పంచ్ భర్త కాంట్రాక్టర్ రామదాసు స్పందిస్తూ వాటిని తీవ్రంగా ఖండించారు. గ్రామ అభివృద్ధి కోసం తాను తన భార్య పని చేశామని తెలిపారు. సర్పంచ్ ఎన్నికలలో తమకు వ్యతిరేకంగా ఫలితాలు వచ్చినప్పటికీ ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. తాను ఎవరి పైన దాడి కి పాల్పడలేదని తనకు ఎలాంటి గ్యాంగ్ లేదని ఎవరిపై తనకు కక్ష లేదని రాందాస్ పేర్కొన్నారు. తనపై గ్రామ యువకులపై ప్రస్తుత సర్పంచ్ తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని ఆరోపించారు. తలపై అనుచిత వ్యాఖ్యలు చేసి పరువుకు భంగం కలిగించారని ఆరోపణలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి అసలు తప్పు ఎవరిదో నిర్ధారించి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రాందాస్ కోరారు. అలాగే తనకు ప్రాణహాని ఉందంటూ సర్పంచ్ చేసిన ఆరోపణలు సైతం వాస్తవాలను పరిశీలించి గ్రామస్థాయిలో విచారించి తప్పు ఎవరిదైతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామస్తులు భాస్కర్ అజ్మీర కుమార్ మంగ్య రవి దేవా హరి సాగర్ నవీన్ లక్ష్మణ్ వీరన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురం గ్రామంలో వీధి దీపాలు వెలిగేలా విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు

**పర్యవేక్షించిన సర్పంచ్ మడకం మూలమ్మ**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 01 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామపంచాయతీ లో పై గుంపులో వీధి రోడ్లలో ఉన్నటువంటి కరెంటు స్తంభాలకు ఉన్న వీధిలైట్లకు సంబంధించిన, విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు సర్పంచ్ మడకం మూలమ్మ విద్యుత్ దీపాలు, వెలిగేలా పనులు చేపట్టి పరివేక్షించారు. వెంకటాపురం గ్రామంలో వీధిలైట్లు సక్రమంగా పనిచేసేలా, స్థానిక ప్రజలకు రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా మరమ్మతు పనులు శరవేగంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడకం మూలమ్మ,7వ వార్డు సభ్యురాలు గుండి మంగమ్మ మాజీ సర్పంచ్,శెట్టిపల్లి,నాగేశ్వరరావు,మరియు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు గ్రామంలో తలెత్తకుండా ప్రజల శ్రేయస్సు,ముఖ్యంగా ,గ్రామ,అభివృద్ధి, కార్యక్రమాలు, చేపడుతున్నామని సర్పంచ్ మూలమ్మ తెలిపారు.

## వైద్య ఖర్చుల సహాయనిధి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 01 ( తొలివార్త ):** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చర్ల మండలానికి చెందిన అకుల భాస్కర్‌రావు అనారోగ్యంతో చికిత్స పొందిన నేపథ్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్, ద్వారా మంజూరైన రూ.44,000/- ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా లబ్దిదారులకు,అందజేశారు.అనారోగ్యంతో చికిత్స పొందిన భాస్కర్‌రావు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిన ఈ ఆర్థిక సహాయం వైద్య ఖర్చులకు కొంత ఊరటనిచ్చింది.ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే నమ్మండి

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ నవీన్ కుమార్**

గుర్రంపోడు **అక్టోబర్ 01 ( తొలివార్త ):**గుర్రంపోడు మండల కేంద్రంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్--2026 కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి సర్కిల్ సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. "ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే నమ్మండి" అనే సందేశంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్టులు, యూపీఐ, క్యూఆర్ కోడ్, ఓటీపీ మోసాలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, పెట్టుబడుల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంకింగ్ సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో గుర్రంపోడు ఎస్ఐ ఎన్. వెంకన్న, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



## వి బి జి రాంజీ పథకం పది లక్షల వ్యయంతో వి ఓ, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ ఎనిక ఉషారాణి



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 01 ( తొలివార్త ):** అశ్వాపురం మండలంలోని చింతిర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని కట్టవారిగూడెం లో గురువారం, వి బి జి రాంజీ పథకం కింద 10 లక్షల వ్యయం తో, నూతనంగా, నిర్మించబోతున్న వి. ఓ, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థానిక సర్పంచ్ ఎనిక ఉషారాణి, శంకుస్థాపనలో మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి ఉపసర్పంచ్ పున్నారెడ్డి,భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీవో సీతారామయ్య, సంబంధిత అధికారులు, మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఉపసర్పంచ్ పున్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏనిక రవి బాబు, గాదె ప్రతాపరెడ్డి, గ్రామపంచాయతీ సెక్రెటరీ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వార్డు మెంబర్లు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ బండారు రాజాను ఘనంగా సన్మానించిన

**తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్**



**సూర్యాపేట అక్టోబర్ 01 ( తొలివార్త ):** ఇటీవల రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైన బండారు రాజాను గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని ఎంతో ఆప్యాయతగా పలకరిస్తూ అందరితో అజాత శత్రువుగా పేరు సంపాదించుకున్న బండారు రాజా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలలో ఎంతోమంది రక్తం సరిపోక ప్రాణాలు కోల్పోతుంటారని, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఎల్లవేళలా రక్తం అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలని తెలిపారు. వీరి వెంట బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు రజాక్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి జీడి బిక్షము, నాయకులు గుజ్జ యుగేందర్, గాలి సాయి, కొండపల్లి సాగర్ రెడ్డి, మీలా వంశీ, వాంకుడోత్ వెంకన్న, మద్దెల వీరస్వామి, అమరవాది శ్రవణ్ , కొల్లూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ నవరాత్రి మహోత్సవాల్లో కర్ర పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం, అక్టోబర్ 01 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణంలోని భూపతిరావు కాలనీలో నవదుర్గ యూత్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి తొమ్మిది రోజుల దసరా నవరాత్రి మహోత్సవాలు భాగంగా గురువారం కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ పాల్గొని కర్ర పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, భద్రాచలం నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భూపతిరావు కాలనీ యూత్ సభ్యులు, మహిళలు, పెద్దలు, మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం..

**నూతనకల్, అక్టోబర్ 01 ( తొలివార్త ):**భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నిర్వహించే కార్యక్రమమైన సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని బిక్కుమల్ల, ఎర్రపహాడ్ గ్రామాలలోని అంగన్వాడి టీచర్లను బిజెపి మండల అధ్యక్షులు కప్పల హనుమంతు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మద్ది సంజీవరెడ్డి, కప్పల సత్తయ్య గౌడ్,గునగంటి లింగయ్య గౌడ్,గొడిశాల లింగయ్య గౌడ్,అంగన్వాడి టీచర్లు ఉమ,అనిత,మంజుల తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీలలో గ్రామసభల నిర్వహణ..

**ఎంపీడీవో సునీత..**



**నూతనకల్, అక్టోబర్ 01 ( తొలివార్త ):**మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని గ్రామపంచాయతీలలో నేటి నుండి విజిపిపి (వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక) గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామాల అభివృద్ధికి కావలసిన పనుల ప్రణాళికలను ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకారం పనులను పూర్తి చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు తెలిపారు.

## నూతనకల్ లో ఘనంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలు..

**నూతనకల్, అక్టోబర్ 01 ( తొలివార్త ):**మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగం సుధాకర్ రెడ్డి,సర్పంచ్ లు గుగులోత్ కృష్ణ నాయక్, పాండవుల లింగన్న,జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్, భూరెడ్డి సంజీవరెడ్డి,దరిపల్లి వీరన్న,ఇమ్మారెడ్డి మల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య,ఉప్పుల పాపయ్య,నకిరేకంటి మధు, బంటు బద్రి,ఇమ్మారెడ్డి మహేష్ రెడ్డి,జటంగి గణేష్ యాదవ్, బంటు క్రాంతి,మేడిపల్లి అశోక్, కారింగుల రాజు,గంగయ్య, జహంగీర్, మహేష్, చంద్రు, సజ్జన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో

**తాతిరెడ్డి మేఘన కాంతిప్రియకు నాలుగు బంగారు పతకాలు**



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 01 ( తొలివార్త ):** హైదరా బాద్ సెంట్రల్ యూనివర్సిటీ 2026 స్నాతకో త్సవంలో తాతిరెడ్డి మేఘన కాంతిప్రియ అరుదైన ఘనత సాధించారు. ఆంత్రోపాలజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆమె అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు పతకాలను అందుకు న్నారు. యూనివర్సిటీ పీజీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచినందుకు యూనివర్సిటీ పీజీ టాపర్ మెడల్, ప్రొఫెసర్ ఎల్.కె. మూర్తి మెడల్ -- ఫిజికల్ అండ్ ఆర్కియాలజికల్ ఆంత్రోపాలజీ, అలుమ్ని మెడల్ ఫర్ సోషల్ ఆంత్రోపాలజీ, లేట్ నంపల్లి అశోక్ కుమార్ మెడల్ -- ఫీల్డ్‌వర్క్ డిసర్టేషన్లను ఆమె అందుకున్నారు. ఆంత్రోపాలజీలో మాస్టర్స్ చదువుతున్న సమయంలో మేఘన కాంతిప్రియ "ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్ జనరేషనల్ చేంజెస్"అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. విద్య, సమాజం, తరాల మధ్య చోటుచేసుకునే మార్పులను అధ్యయనం చేస్తూ ఫీల్డ్‌వర్క్ ఆధారంగా ఆమె ఈ పరిశోధన చేపట్టారు. యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనురాధ, స్నాతకోత్సవ ముఖ్య అతిథి, డీఆర్‌డీఓ మాజి డైరెక్టర్ డాక్టర్ సమీర్ వి. కామత్ తదితర ప్రముఖుల సమక్షంలో మేఘన కాంతిప్రియ ఈ బంగారు పతకాలను అందుకున్నారు. తాతిరెడ్డి ధనలక్ష్మి - గోవిందరెడ్డి(జాతీయ మానవ జంతు హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధి), దంపతుల కుమార్తె అయిన మేఘన కాంతిప్రియ స్వగ్రామం మొరంపల్లి బంజర. ప్రస్తుతం ఆమె కుటుంబం సారపాకలో నివసిస్తోంది. ఒకేసారి నాలుగు బంగారు పతకాలు సాధించి విద్యా, పరిశోధనా రంగాల్లో ప్రతిభ చాటిన మేఘన కాంతిప్రియను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు అభినందించారు. విద్యాభ్యాసంలో తన ప్రతిభను కొనసాగిస్తూ, ప్రస్తుతం అదే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీటు సాధించి, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో ఉన్న పిల్లలు మరియు వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, కుటుంబపరమైన సవాళ్లపై పరిశోధన చేస్తున్నారు. తల్లిదండ్రులు, గురువుల ద్వారా నేర్చుకున్న విలువలు, నైతికతతో పాటు తాను అభ్యసించిన విద్యను సమాజ శ్రేయస్సుకు వినియోగించడమే తన ప్రధాన లక్ష్యమని మేఘన కాంతిప్రియ తెలిపారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత తమ్మిశెట్టి శ్రీనివాస్ కి ఘన సన్మానం





**సింగరేణి అక్టోబర్ 01 ( తొలివార్త ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న తమ్మిశెట్టి శ్రీనివాస్ కు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు అధ్యాకేతర సిబ్బంది విద్యార్థులు సంయుక్తంగా గురువారం అభినందన సభ నిర్వహించారు. శాలువా కప్పి మెమెంటోను అందజేశారు ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ చేసిన కృషి ఫలితంగా రాష్ట్ర అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. నేడు చరిత్ర అధ్యాపకుడిగా విద్యార్థులకు అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. చరిత్ర బోధన కష్టతరమైన విద్యార్థులకు సులభరీతిలో బోధిస్తూ చేస్తున్న కృషికి గుర్తింపు గా రాష్ట్ర అవార్డు రావడం ఎంతో మందికి స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు. మును ముందు మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టి జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెల రవీందర్ శాంతినగర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు చర్ల ప్రిన్సిపాల్ నాగేందర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డిపి గణేష్ టేకులపల్లి ప్రిన్సిపాల్ పవన్ జిల్లా హౌసింగ్ బోర్డ్ అధ్యక్షులు శేష ప్రసాద్ సుధారాణి వేణు దుర్గాప్రసాద్ పార్థసారథి యాకయ్య వనిత బాబురావు రాంబాబు లక్ష్మీనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

## పబ్బు రాజు గౌడ్‌ను పరామర్శించిన చౌటుప్పల్ మండల రిపోర్టర్లు

**పబ్బు వజ్రమ్మకు ఘన నివాళి**



**చౌటుప్పల్ అక్టోబర్ 01 ( తొలివార్త ):** మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి పబ్బు వజ్రమ్మ మృతి పట్ల చౌటుప్పల్ మండల రిపోర్టర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.రాజు గౌడ్‌ను పరామర్శించి,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.పబ్బు వజ్రమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని చౌటుప్పల్ మండల రిపోర్టర్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల రిపోర్టర్లు పాల్గొని పబ్బు రాజు గౌడ్ కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో తొలి వార్త రిపోర్టర్ కూచిమల్ల భగవంత్ తొలి అక్షరంరిపోర్టర్ దోర్నాల గజేందర్,వార్త మిర్రర్ రిపోర్టర్ ఆరుట్ల లింగస్వామి, విశాలాభారతి రిపోర్టర్ తుమ్మల నాగరాజు రెడ్డి,విజయ క్రాంతి రిపోర్టర్ నీళ్ళ శంకర్,తదితరులు పాల్గొన్నారు

## ఉచిత విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం

**పనికిరాని ఉచిత పథకాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు - యుఎస్ఎఫ్ఐ.**




**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 01 ( తొలివార్త ):ప్రతి నిధి.** ప్రజలకు అత్యంత అవసరమైన ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు ముందుకు రావడం లేదని యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం చంద్రకాంత్ ప్రశ్నించారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పనికిరాని ఎన్నో ఉచిత పథకాలను ప్రకటిస్తూ ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు, ప్రజల ప్రాణానికి, భవిష్యత్తుకు అవసరమైన విద్య, వైద్యాన్ని మాత్రం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా కార్పొరేట్ విద్య, కార్పొరేట్ వైద్యానికి ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని అన్నారు. దీని వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు లక్షల రూపాయలు ఫీజులు చెల్లించలేక, ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజ్యాంగం ప్రసాదించిన విద్య, వైద్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ఉచిత విద్య, వైద్యాన్ని పేదలకు అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రభుత్వ విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ లో నిధులు పెంచి, పేద ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని యుఎస్ఎఫ్ఐ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## ప్రగతి నగర్‌లో రూ.12 లక్షల సీఎంసీ నిధులతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 01 ( తొలివార్త ):ప్రతి నిధి.** 276వ ప్రగతి నగర్ డివిజన్‌లోని జయ ఆర్కేడ్ నుంచి వింధ్య ప్రైడ్ వరకు సీఎంసీ నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకుకుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో భారీ బహిరంగ సభ లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 01 ( తొలివార్త ):ప్రతి నిధి.** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు రూ.350 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# అంతమ్మగూడెం, దోతిగూడెం కెమికల్ పరిశ్రమలను వెంటనే మూసివేయాలి

**కెమికల్ పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి తగిన నష్టపరిహారం చెల్లించాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ డిమాండ్**






**పోచంపల్లి అక్టోబర్ 01 ( తొలివార్త ):** పోచంపల్లి మండలం పరిధిలోని అంతమ్మగూడెం,దోతిగూడెం గ్రామాలలో కొనసాగుతున్న కెమికల్ పరిశ్రమల వల్ల స్థానిక ప్రజలు,రైతాంగం తీవ్ర నష్టాన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆ పరిశ్రమలను ప్రభుత్వం వెంటనే మూసివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కెమికల్ పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణం నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని సూచించారు.గురువారం పోచంపల్లి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అంతమ్మగూడెం,దోతిగూడెం గ్రామాలలో ఉన్న కెమికల్ పరిశ్రమలను ఎత్తివేయాలని,పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అంతమ్మగూడెం,దోతిగూడెం గ్రామాలల నుండి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు 11 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించుకుంటూ ఆర్డిఓ కార్యాలయం ముందు నిర్వహించిన మహాధర్నాకు ముఖ్యఅతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ ఈ కెమికల్ పరిశ్రమల నుండి వెలువడుతున్న విషపూరిత రసాయనాలు, పొగ,వ్యర్థాల కారణంగా వాయు,నీటి కాలుష్యం కోరలు చాచిందని ఆందోళన వ్యక్తం చేశారు.కాలుష్యం వల్ల వ్యవసాయ భూములు,పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.పండించిన పంటలు కూడా విషతుల్యంగా మారుతున్నాయని తెలిపారు.వ్యవసాయంతో పాటు పశు పోషణ,చేతివృత్తులపై ఆధారపడిన వృత్తిదారులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పరిశ్రమల నుంచి వదిలే వాయువుల్లో 12 రకాల ప్రమాదకరమైన రసాయనాలు గాలిలో కలుస్తున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సి.పి.సి.బి.)అధికారులు గుర్తించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ఈ కాలుష్య గాలిని పీల్చడం వల్ల స్థానిక ప్రజలు క్యాన్సర్,చర్మవ్యాధులునాడీ వ్యవస్థ దెబ్బతినడం,కిడ్నీ సమస్యలు వంటి అనేక ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారని మండిపడ్డారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో స్థానికులకు అవకాశం కల్పించకపోవడం,నష్టపోతున్న రైతులను గుర్తించకపోవడం దారుణమన్నారు.కాలుష్యానికి కారణమవుతున్న ఈ కెమికల్ పరిశ్రమలను తక్షణమే ఇక్కడి నుండి తరలించాలని,అలాగే కాలుష్యం వల్ల నష్టపోయిన రైతాంగానికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పరిశ్రమల కాలుష్యం వల్ల పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు.2019 నాటి కమిటీ సూచనల ప్రకారం సంవత్సరానికి ఎకరానికి రూ.52,000 చొప్పున తక్షణమే చెల్లించాలి. అలాగే,పరిశ్రమల యాజమాన్యాలు కలెక్టర్ కార్యాలయంలో 2021లో జమ చేసిన రూ.23 లక్షల పంట నష్టపరిహారాన్ని వెంటనే రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.కాలుష్యం కారణంగా పడావు పడ్డ అన్ని వ్యవసాయ భూములకు పంట నష్టపరిహారం అందజేయాలని,పంటలభూములు, భూసారం, నీటి వనరులు మరియు ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి న్యాయమైన పరిహారం అందించాలని అన్నారు. పొల్యూషన్ మరియు రైతుల నష్టాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో గ్రామ రైతులకు, ప్రజలకు అవకాశం కల్పించాలని ప్రజా అభిప్రాయాలను సేకరణ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.నష్టపోయిన రైతులను గుర్తించడం కోసం వెంటనే రీ-సర్వే చేపట్టాలి.కాలుష్య ప్రభావిత భూములు,పంటలు,నీటి వనరులు మరియు జీవనోపాధి నష్టాలను సమగ్రంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఆందోళన పెద్ద ఎత్తున కొనసాగిస్తా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా మాట్లాడుతూ పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి,ప్రజల ప్రాణాలకు,పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని డిమాండ్ చేసినారు.పరిశ్రమల వల్ల కలుషితమైన భూగర్భ జలాలు,చెరువులు,బోరుబావులు మరియు ఇతర నీటి వనరులను శాస్త్రీయంగా పరీక్షించి,నివారణ చర్యలు చేపట్టాలి.పరిశ్రమల నుండి వెలువడే విషపూరిత వాయువులు,పొగ మరియు రసాయన వ్యర్థాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ కాలుష్యాన్ని నియంత్రించాలని అన్నారు.అంతమ్మగూడెం దోతిగూడెం గ్రామాల ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని,కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని గుర్తించేందుకు సమగ్ర ఆరోగ్య సర్వే చేపట్టాలని,కాలుష్యం వల్ల రైతులు,వ్యవసాయ కూలీలు,వృత్తిదారులు కోల్పోతున్న జీవనోపాధిపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి,వారికి తగిన నష్టపరిహారం మరియు పునరావాస సహాయం అందించాలి సూచించారు.గ్రామ ప్రజల మరియు రైతుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ,కాలుష్య సమస్యపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో గ్రామ ప్రజలు,రైతు సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని,పరిశ్రమల నుండి వెలువడే పొల్యూషన్ అంచనా వేయడానికి పొల్యూషన్ తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆర్డీవో కు డిమాండ్లతో కూడిన మెమొరండాన్ని అందించగా వారు ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ 15 రోజులలోపు రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపడతామని,రైతులకు జరుగుతున్న నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి రీసర్వే చేయిస్తామని,మిగతా సమస్యలపై జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులతో చర్చించి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చినారు.ఈ కార్యక్రమానికి సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శివర్గ సభ్యులు సిపిఎం ప్రసాదం విష్ణు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి,సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి,సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శి కోటరామచంద్రారెడ్డి,చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు,చౌటుప్పల పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా,గడ్డం వెంకటేష్,రాయగీర్ కిష్టయ్య, సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శివర్గ సభ్యులు పగిల్ల లింగారెడ్డి,మంచాల మధు చౌటుప్పల్ మండలం కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి చింతల సుదర్శన్,సీపీఎం నాయకులు బండారు నరసింహ,ఆదిమూలం నందీశ్వర్ పొట్ట శ్రీనివాస్ బోధస్ వెంకటేష్,కొండే శ్రీశైలం,కొంతం సుశీల,శ్రీనివాస్ రెడ్డి,కాసం వెంకటేశం,నేరేడు మహేష్,చీరిక అలివేలు,బత్తుల దాసు,పకీరు పెంటా రెడ్డి,పకీరు లక్ష్మమ్మ, చెరుకు సత్తయ్య, అంజయ్య, సామజంగారెడ్డి, కల్కూరి బిక్షపతి,నెల్లికంటి జంగయ్య,వడ్డేపల్లి యాదగిరి,బుగ్గ లక్ష్మయ్య,ౕైతులు జి.దామోదర్ రెడ్డి,కే.మహేష్,ఆర్ రామిరెడ్డి,ఆర్. ధనలక్ష్మి,వి.రేణుక, జి.రామచంద్రారెడ్డి,ఎం సత్తయ్య,సత్యం, అర్జున్ రెడ్డి,జి.మల్లేష్,బి. బిక్షపతిమ ల్లారెడ్డి, ఎల్లమ్మ,రాకేష్,శ్రీశైలం తో పాటు స్థానిక గ్రామ ప్రజలు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మెరుగైన మౌలిక వసతుల కల్పనతోనే ప్రజల జీవన ప్రమాణాల పెంపు

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 01 ( తొలివార్త ):ప్రతి నిధి. కుత్బుల్లాపూర్ డివిజన్లో 1.16 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్లోని పలు కాలనీలలో దాదాపు 1.16 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మౌలిక వసతుల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాల పెంపు, నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లోని పలు కాలనీలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పరుస్తామన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా

**.పద్మా నగర్ ఫేజ్ -2 కాలనీ వాసులు.**

పద్మా నగర్ ఫేస్ -2 కాలనీ అభివృద్ధిలో భాగంగా నూతనంగా 77.20 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా కాలనీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ జైన్, నాగేశ్వరరావు, దుర్గారెడ్డి, కెవిఏఎన్ చారి, సంజయ్, శోభన్, గణేష్, వీరేశ్, ఆంజనేయులు, షఫీ, భాస్కర్ గౌడ్, బ్రహ్మం, రాజన్న, కుమార్, రాంబాబు, మురళి, విశ్వనాథ్, పాపయ్య, పిలాయి రమేష్, సుబ్బారావు తదితరులు.

**పద్మా నగర్ ఫేస్ -1 కాలనీ వాసులు.**

పద్మా నగర్ ఫేస్ -1 కాలనీ అభివృద్ధిలో భాగంగా నూతనంగా 28.00 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా కాలనీ అధ్యక్షులు సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలు రమణారెడ్డి, నరసింహారెడ్డి, బాంబే శీను, ముత్యాలు, నాగిరెడ్డి, కాసింపీరా, వేణు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర రావు, రంగా సుబ్బయ్య, వినోద్ కుమార్, రాములు నాయక్, విజయ్ సారథి తదితరులు.

**ఎన్టీఆర్ నగర్.**

ఎన్టీఆర్ నగర్ అభివృద్ధిలో భాగంగా నూతనంగా 11.00 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటుగా ఎన్టీఆర్ నగర్ అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రావు, కోశాధికారి వీరేశం, కాలనీవాసులు నరసింహారెడ్డి, చంద్రమౌని తదితరులు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, యాదగిరి బాపు, వనం శ్రీను, ఎండి.నసీరుద్దీన్, ఆంజనేయులు, వెంకటేష్, అజయ్, నాగేష్ , యాదగిరి, డీజే రమేష్, జయం చారి, శౌరి రాజ్, శివ్ రాజ్, సతీష్, కేదార్నాథ్, వైద్యనాథ్, స్థానిక కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కెమికల్ పరిశ్రమలను వెంటనే మూసివేయాలి

**కాలుష్యంతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జహంగీర్ డిమాండ్**

**పోచంపల్లి, అక్టోబర్ 01 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండల పరిధిలోని అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల్లో కొనసాగుతున్న కెమికల్ పరిశ్రమల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పర్యావరణానికి, వ్యవసాయానికి నష్టం కలిగిస్తున్న పరిశ్రమలను వెంటనే మూసివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమల కాలుష్యం కారణంగా నష్టపోయిన రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పరిశ్రమలను ఎత్తివేయాలని, కాలుష్యంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం పోచంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల నుంచి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలు, పొగ, వ్యర్థాల కారణంగా వాయు, నీటి కాలుష్యం పెరుగుతోందని ఆరోపించారు. కాలుష్యం కారణంగా వ్యవసాయ భూములు, పంటలు దెబ్బతింటున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జహంగీర్ తెలిపారు. పశుపోషణ, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు సైతం కాలుష్య ప్రభావంతో జీవనోపాధిని కోల్పోతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణంపై పరిశ్రమల ప్రభావాన్ని ప్రభుత్వం శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని డిమాండ్ చేశారు. నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలి పరిశ్రమల కాలుష్య ప్రభావంపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రభావిత వ్యవసాయ భూములు, పంటలు, భూగర్భ జలాలు, చెరువులు, బోరుబావులు, పశుపోషణ, ఇతర జీవనోపాధి రంగాలకు జరిగిన నష్టాన్ని శాస్త్రీయంగా నమోదు చేయాలని జహంగీర్ కోరారు. కాలుష్యం కారణంగా సాగుకు అనువుగా లేకుండా పడావుగా మారిన వ్యవసాయ భూములకు కూడా నష్టపరిహారం అందించాలని అన్నారు. 2019 నాటి కమిటీ సూచనల మేరకు ఎకరానికి సంవత్సరానికి రూ.52 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 2021లో పరిశ్రమల యాజమాన్యాలు కలెక్టర్ కార్యాలయంలో జమ చేసిన రూ.23 లక్షల పంట నష్టపరిహారం నిధులను వెంటనే రైతులకు పంపిణీ చేయాలని కోరారు. కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్యానికి గురైన భూగర్భ జలాలు, చెరువులు, బోరుబావులను శాస్త్రీయంగా పరీక్షించి, కాలుష్య నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. 15 రోజుల్లో పరిహారం అందేలా చర్యలు ధర్నా అనంతరం సీపీఎం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ రైతులకు నష్టపరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేస్తామని, 15 రోజుల్లో రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి రీ-సర్వే నిర్వహిస్తామని తెలిపారు. మిగతా సమస్యలను జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా వైద్యుడు దివంగత డాక్టర్ జగదీష్ కి ప్రజల నివాళి.







**ఖమ్మం అక్టోబర్ 01 ( తొలివార్త ):** భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రముఖ న్యూరో శాస్త్ర చికిత్స నిపుణులు దివంగత డాక్టర్ కస్తుర్తి జగదీష్ సంస్వరన సభకు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా పీవీ శ్రీనివాస్ మమత హాస్పిటల్ డైరెక్టర్ నరేన్ స్పర్శ భాస్కర్ బిచ్చల తిరుమలరావు చెర్ర రవి దేవి రెడ్డి విజయ్ డాక్టర్ జగదీష్ సతీమణి డాక్టర్ సుమనా ప్రీతి గుంతేటి వీరభద్రం డాక్టర్ కె.వి.కృష్ణారావు డాక్టర్ జివి మురళి డాక్టర్ వెంకటేష్ డాక్టర్ వెంకటేశ్వర్లు డా. ఏడుకొండలు డాక్టర్ అల్తాఫ్ డాక్టర్ వై ప్రసాదరావు డాక్టర్ బి.ఎస్.రావు సిపిఎం జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా నాయకులు గాంధీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవులూరి మధు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు వైద్య రంగానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ డాక్టర్ జగదీష్ వైద్యరూధిని సేవా దృక్పథంతో నిర్వహిస్తూ వేలాది మంది రోగులకు నూతన జీవితం ప్రసాదించారని అన్నారు. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలు మానవతా విలువలు నిబద్ధత సమాజానికి ఆదర్శప్రాయం అని పేర్కొన్నారు. డాక్టర్ జగదీష్ మరణం వైద్య రంగానికి కాకుండా సమాజానికి తీరని లోటని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన సేవ స్ఫూర్తి అంకితభావం భావితర వైద్యులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులు డాక్టర్ జగదీష్ మిత్రులు ఖమ్మం వారు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జ్యోతి వృద్ధాశ్రమంలో జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో

**వృద్ధులకు పాలు పండ్లు బ్రెడ్లు పంపిణీ**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 01 ( తొలివార్త ):** సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ పిలుపుమేరకు కొత్తగూడెం పట్టణంలోని శ్రీ జ్యోతి వృద్ధాశ్రమం లో గల వృద్ధులకు ఓబీసీ మోర్చా భద్రాది కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పండ్లు, పాలు, బ్రెడ్లు, వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జటంగి కృష్ణ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల పరిపాలన లో భారతదేశ ప్రజలకు అందించిన సేవలను కొనియాడుతూ దేశ ప్రధానిగా 13 సంవత్సరాల పరిపాలనలో నిస్వార్థ రాజకీయ నాయకుడిగా ప్రజల సంక్షేమం దేశాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ సుపరిపాలన అందించారని పేర్కొన్నారు ప్రజల ఆశీస్సులతో 2047 వరకు వారు తల పెట్టిన వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు తాటిపాముల ఐలయ్య బడే రమేష్ పీసీ కేశవ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవరపల్లి వెంకటేశ్వరరావు కొండపాక శ్రీనివాసరావు కార్యదర్శి రాయపు రెడ్డి సత్యనారాయణ కోశాధికారి గుమ్మల్ల వెంకటేశ్వరరావు(జీవ )జిల్లా కార్యవర్గ సభ్యులు కోటోజు రాంబాబు ఓబిసిమోర్చా భద్రాచలం మండల అధ్యక్షులు షేర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
తెలుగు దిన పత్రిక
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



# దేశంలోనే తొలిసారి ప్రభుత్వ రంగంలో '3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్లు'

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో ప్రయోగాత్మకంగా 100 ఇళ్లను సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ) నిర్మించనుంది. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో అమలు కానుంది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా ఇళ్ల నిర్మాణంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ అధునాతన సాంకేతికతను తీసుకురానున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 పథకం కింద గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో ప్రయోగాత్మకంగా 100 ఇళ్లను నిర్మించనున్నారు. సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర గృహనిర్మాణశాఖ, కేంద్ర ప్రభుత్వం, సీబీఆర్ఐ మధ్య అక్టోబర్ 4న ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందం జరగనుంది.325 చదరపు అడుగుల్లోనే నిర్మాణం: కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో ఇంటిని 325 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. ఇతర దేశాలు, ప్రైవేటు రంగంలో ఇప్పటికే 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ విధానం అమల్లో ఉంది. దేశ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యతను మరింత మెరుగుపరిచేలా




ఇంటి నిర్మాణంలో సీబీఆర్ఐ సాంకేతిక మార్పులు చేసింది. ఇందుకోసం ప్రత్యేక నిర్మాణ నమూనాను రూపొందించింది. పీఎంఏవై-గ్రామీణ్ 2.0 పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సాయం కంటే 3డీ కాంక్రీడ్ ప్రింటింగ్ విధానంలో చేపట్టే ఇళ్లకు అదనంగా నిధులు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు నూతన సాంకేతికతను ప్రోత్సహించేందుకు ఈ ఇళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు మొత్తాన్ని భరించనున్నాయి.రోబోటిక్ పరిజ్ఞానంతో నిర్మాణం: 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఆధునిక రోబోటిక్ సాంకేతికత ఆధారంగా పనిచేస్తుంది. తొలుత ఆర్కిటెక్ట్ కంప్యూటర్?లో 3డీ క్యాడ్ సాఫ్ట్‌వేర్ ద్వారా భవనం నమూనాను రూపొందిస్తారు. 3డీ ప్రింటింగ్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన కాంక్రీట్ మిశ్రమాన్ని పంప్ ద్వారా ప్రింటర్‌కు పంపుతారు. కంప్యూటర్ కమాండ్ల ఆధారంగా రోబోటిక్ హ్యాండ్ లేదా గ్యాంట్రీ ప్రింటర్ నాజిల్ పనిచేస్తాయి. వీటి ద్వారా కాంక్రీట్‌ను నిర్ణీత మార్గంలో పొరలు పొరలుగా వేస్తుంది. ఆ తర్వాత ఒక పొర వేసిన వెంటనే అది త్వరగా గట్టిపడుతుంది. దానిపై వచ్చే తదుపరి పొర బరువును తట్టుకునేలా ఈ పదార్థాన్ని రూపొందిస్తారు.వేగంగా తక్కువ వృథాతో: సాధారణ నిర్మాణ పద్ధతితో పోలిస్తే 50-70 శాతం వేగంగా ఇళ్లను పూర్తి చేసే అవకాశం ఉంది. సెంటరింగ్ సామగ్రి అవసరం ఉండదు. అదేవిధంగా మెటీరియల్ విషయానికి వస్తే వృథా 30-60 శాతం వరకు తగ్గుతుంది. వంపులు, సంక్లిష్టమైన ఆర్కిటెక్చర్ డిజైన్లను సైతం సులభంగా నిర్మించవచ్చు. తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఈ సాంకేతికత దోహదపడనుంది.

# ఏపీలో స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

### పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు సిద్ధం

రాష్ట్రంలో 100 పట్టణ స్థానిక సంస్థలు, 13,313 పంచాయతీలు, 9,983 ఎంపీటీసీ, 661 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రిజర్వేషన్లు ఖరారు చేయగానే ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది.రాష్ట్రంలో పురపాలక పంచాయతీల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి రాష్ట్రంలో 100 పట్టణ స్థానిక సంస్థలు, 13,313 పంచాయతీలు, 9,983 ఎంపీటీసీ, 661 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటర్ల జాబితాల ప్రచురణ, వాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు పూర్తి చేశాయి. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అధికారులు నివేదించారు.కోర్టు కేసులు తేలాక : వివిధ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయగానే ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. పెండింగ్‌లోని కోర్టు కేసులు తేలాక మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలు, మరో 38 గ్రామ పంచాయతీల్లోనూ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తారు. అక్టోబరు-డిసెంబరు మధ్య మున్సిపల్, పంచాయతీరాజ్ సంస్థల్లో ఎన్నికలు పూర్తి చేసి కొత్త ఏడాది ప్రారంభం నాటికి కొత్త పాలకవర్గాలు కొలువుదీరాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు చకచకా ఏర్పాట్లు చేశారు. న్యాయపరమైన అవాంతరాలను అధిగమించి ఈ నెల మొదటి వారంలోగా రిజర్వేషన్లు ఖరారు చేసే యోచనతో ప్రభుత్వం ఉంది. ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.ఈ నెల మొదటి వారంలో : ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల మొదటి వారంలో వెలువడే అవకాశం ఉందన్న సమాచారంతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ క్షేత్రస్థాయిలో కమిషనర్లు, ఎన్నికల సిబ్బందిని సమాయత్తం చేస్తోంది. ఇందుకోసం మొదటి ప్రాంతీయ సదస్సు విశాఖపట్నంలో బుధవారం ప్రారంభమైంది. రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురాల్లోనూ వీటిని నిర్వహించనున్నారు. సిబ్బందికి శిక్షణ కూడా అందిస్తున్నారు.తెలంగాణ నుంచి మరో 30 వేలు : ఎన్నికల నిర్వహణకు జిల్లాలకు లక్ష బ్యాలెట్ బాక్సులు పంపుతున్నారు. ఇప్పటికే 30 వేల వరకు చేరుకున్నాయి. పురపాలక,



పంచాయతీరాజ్‌శాఖలు 50 వేల కొత్త బాక్సులు సేకరించాయి. పాతవి 20 వేలు వరకు ఉన్నాయి. తెలంగాణ నుంచి మరో 30 వేలు తెప్పిస్తున్నారు. మొదట పుర ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున నగరాలు, పట్టణాలకు ప్రాధాన్యమిస్తున్నారు. వంద పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఈ ఎన్నికల్లో అదనంగా 736 డివిజన్లు, వార్డులు ఏర్పాటయ్యాయి. పునర్విభజన ప్రక్రియలో భాగంగా 3,206 డివిజన్లు, వార్డుల సంఖ్యను 3,942కు పెంచారు.

# మద్యం రవాణా కుంభకోణంలో ఈడీ దూకుడు

### ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి నోటీసులు

వైఎస్సార్సీపీ హయాం నాటి మద్యం రవాణా కుంభకోణంలో మరో వైఎస్సార్సీపీ నేతకు ఈడీ నుంచి పిలుపు వచ్చింది. గత ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ వైఎస్సార్సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన విజయానందరెడ్డికి ఈడీ నోటీసులు జారీచేసింది. వైఎస్సార్సీపీ హయాం నాటి మద్యం రవాణా కుంభకోణంలో మరో వైఎస్సార్సీపీ నేతకు ఈడీ నుంచి పిలుపు వచ్చింది. గత ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ వైఎస్సార్సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎర్రచందనం స్మగ్లర్ మెట్టపల్లి చిన్నపరెడ్డి విజయానందరెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. ఉదయం పదకొండున్నర గంటలకు హైదరాబాద్‌లోని కార్యాలయానికి విచారణకు రావాలని ఆదేశించింది. నిఖిలానంద లాజిస్టిక్స్‌కు భారీ మొత్తంలో అనుచిత లబ్ధిపై విజయానందరెడ్డిని ప్రశ్నించనుంది.ఎర్రచందనం స్మగ్లర్ : గత ఎన్నికల్లో చిత్తూరు శాసనసభ నియోజకవర్గం నుంచి వైఎస్సార్సీపీ తరపున పోటీ చేసిన ఎర్రచందనం స్మగ్లర్ మెట్టపల్లి చిన్నపరెడ్డి విజయానందరెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ అనే ముసుగు సంస్థలను ముందుపెట్టి రాష్ట్ర స్థాయిలో మద్యం రవాణా కాంట్రాక్టు నిర్వహించి రూ.195 కోట్ల దోపిడీకి పాల్పడ్డ వైఎస్సార్‌సీపీ ముఠా ప్రాంతీయ స్థాయిలో ఎక్కడికక్కడ ఆ పార్టీ కీలక నేతలు, వారి అనుచరులకు సబ్ కాంట్రాక్టులు కట్టబెట్టింది.అనుచిత లబ్ధి చేకూర్చి : అందులో



భాగంగా రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో సబ్ కాంట్రాక్టును ఎంపీ విజయానందరెడ్డి సంస్థైన నిఖిలానంద లాజిస్టిక్స్‌కు అప్పగించి భారీ మొత్తంలో అనుచిత లబ్ధి చేకూర్చినట్లు దర్యాప్తులో ఈడీ గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ నుంచి సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్‌కు వాటి నుంచి విజయానందరెడ్డికి చెందిన నిఖిలానంద లాజిస్టిక్స్ ఖాతాల్లోకి డబ్బులు జమయ్యాక అవి వివిధ రూపాల్లో దారి మళ్లినట్లు ఈడీ గుర్తించింది. ఆ వివరాలతో విచారణకు రావాలని విజయానందరెడ్డిని ఆదేశించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదుచేయనుంది.అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు : మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా ఏపీ సిట్ బృందాలు కొన్నాళ్ల క్రితమే విజయానందరెడ్డికి చెందిన నిఖిలానంద అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టాయి. వైఎస్సార్సీపీ నేత, మద్యం కుంభకోణం కేసు నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి చెందిన సీఎమ్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ నిఖిలానంద అపార్ట్‌మెంట్, డోర్ నంబర్ 2-1251-4 చిరునామాతో రిజిస్టరై ఉండటంతో సిట్ బృందాలు అక్కడికి వెళ్లి తనిఖీలు చేశాయి. అయితే సిట్ బృందాలకు అక్కడ సీఎమ్?ఆర్? ప్రాజెక్ట్స్‌కు బదులుగా వెల్‌టాస్క్ ఫుడ్ అండ్ బెవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బోర్డు కనిపించింది. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో వివరాలు పరిశీలిస్తే అసలు ఆ పేరుతో కంపెనీయే లేదని తేలింది. అదే కార్యాలయం నుంచి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, విజయానందరెడ్డికి చెందిన అనేక కంపెనీలు నడుస్తున్నట్లు ఈడీ గుర్తించింది.సాధారణ డ్రైవర్‌గా పనిచేసి : సాధారణ డ్రైవర్‌గా పనిచేసిన విజయానందరెడ్డి ఎర్రచందనం స్మగ్లర్‌గా కోట్లకు పడగలెత్తాడు.అతనిపై స్మగ్లింగ్‌కు సంబంధించిన అనేక కేసులున్నాయి. 2014లోనే పీడీ యాక్ట్ నమోదైంది. స్మగ్లింగ్ అక్రమార్జనతోనే విజయానందరెడ్డి రాజకీయనాయకుడి అవతారమెత్తి 2019 ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల్లో కొందరు వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు పెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక విజయానందరెడ్డికి జగన్ ఏపీఎస్ఆర్?టీసీ వైస్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. మద్యం రవాణా సబ్ కాంట్రాక్టు కట్టబెట్టి లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు ఉన్నాయి.

# వాటితో పాటు నిర్వహిస్తారా ముందే నిర్వహిస్తారా ఖైరతాబాద్ ఉపఎన్నికపై సస్పెన్స్

ఖైరతాబాద్ నియోజకవర్గ ఉపఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఓటర్ల తుది జాబితా ప్రకటించే వరకు ఉప ఎన్నికకు వెళ్లే పరిస్థితులు లేవని తెలుస్తోంది. 2024 ఏప్రిల్ 23 నుంచి ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయింది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బై ఎలక్షన్?పై కేంద్ర ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. 2024 ఏప్రిల్ 23 నుంచే ఖైరతాబాద్ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు ఇటీవల శాసనసభ కార్యదర్శి గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.

### 6 నెలల్లోగా ఉపఎన్నిక నిర్వహించాలి కానీ

శాసనసభ కార్యదర్శి గెజిట్ నోటిఫికేషన్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయం అధికారులు తాజాగా లేఖ రాశారు. సాధారణంగా ఎక్కడైనా నియోజకవర్గం ఖాళీ అయితే 6 నెలల్లోగా బై ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ నియోజకవర్గ విషయంలో తలెత్తిన పరిణామాలతో ఇది సాంకేతికంగా రెండున్నర సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. ఈ పరిస్థితుల్లో వెంటనే ఉప ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది.

### ఓటర్ల జాబితా నవంబర్9న ప్రకటన

వచ్చే సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. వాటితో పాటే ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నిక జరపాలాలేక ముందే నిర్వహించాలాఅనే అంశంపై అధికారులు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. 'సర్' అనంతరం తుది ఓటర్ల జాబితాను వచ్చే నెల 9న ప్రకటిస్తారు. 'సర్' విచారణ గడువును మరోసారి పొడిగించే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఓటర్ల తుది జాబితా ప్రకటించే వరకు ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నికకు వెళ్లే పరిస్థితులు లేవు. ఈ నేపథ్యంలోనే ఖైరతాబాద్‌ఎన్నిక ఎప్పుడు ఉంటుందని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

### ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక నిర్వహించడానికి కారణమిదే

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్, ఆ తరువాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. దానం నాగేందర్ పార్టీ ఫిరాయించినా ఆయనపై చర్యలు తీసుకోకుండా గతంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిటిషన్లను కొట్టివేశారని బీఆర్ఎస్‌పేర్కొంది. స్పీకర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.విచారణ జరిపిన హైకోర్టు డివిజన్



బెంచ్, స్పీకర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పును ఇచ్చింది. ఎమ్మెల్యేగా అనర్హుడని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించి, ఉప ఎన్నిక నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ అయ్యాయి.హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ దానం పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ సందర్భంగా కోర్టు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) నిబంధనలను గుర్తు చేస్తూ వ్యాఖ్యలు చేసింది.

# అర్ధరాత్రీ అదే జోష్ హైదరాబాద్ లో కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్న 'నైట్ లైఫ్'

అర్ధరాత్రివేళ హైదరాబాద్‌మరో సుందర ప్రపంచంగా మారుతోంది! ముఖ్యంగా సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండే హైటెక్ సిటీ, కొండాపూర్, నానక్ రాం గూడ వంటి ప్రాంతాలు నైట్‌లైఫ్‌కు అడ్డాగా మారుతున్నాయి. రాత్రుల్లో కేఫ్, రెస్టారెంట్లు ఎంతో సందడిగా మారుతున్నాయి. హైదరాబాద్‌లో ఒకప్పుడు నైట్‌లైఫ్ అంటే జూబ్లీహిల్స్, నెక్లెస్ రోడ్, బంజారాహిల్స్‌ప్రాంతాలే మదిలో మెదిలేవి! కానీ ఇప్పుడు నగరంలోని టెక్ హబ్‌లు కూడా వాటి సరసన చేరి ప్రతిరోజూ పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. చెవులు చిల్లులు పడేలా శబ్దాలు, నోరూరించే రుచులు, కళ్లు మిరుమిట్లు గొలిపే దీపాలు, పాదాలను కదిలించే సంగీతం ఇలా మరెన్నో. ప్రస్తుతం నగరంలో హైటెక్ సిటీ, కొండాపూర్, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, కోకాపేట్ ప్రాంతాలు సరికొత్త నైట్‌లైఫ్‌కు కేరాఫ్‌గా మారి యువతను ఆకట్టుకుంటున్నాయి.

### ఎలా ఉంటుందంటే

నింగిని తాకుతున్నట్లుగా కనిపించే అద్దాల భవనాలు, వాటి నుంచి ప్రతిబింబిస్తూ రహదారులపై వెలువడే కాంతి కిరణాలు. ఈ కాంతిలో రయ్‌రయ్‌మంటూ దూసుకుపోయే బైక్‌లు, పక్కన వేడి వేడిగా ఆహార పదార్థాలు, వీటి మధ్య కుర్రకారు ఉత్సాహంతో



క్యాండిల్ లైట్ పార్టీకి రోడ్లు వేదికలయ్యాయా అన్నట్లు మెరిసిపోతాయి. ఏదో సరికొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపిస్తుంది. ఈ సందడి మధ్య బర్త్‌డే, ప్రమోషన్, బ్యాచిలర్ పార్టీలతో పాటు లేట్ నైట్ డిన్నర్స్ అలా సాగిపోతుంటాయి.వర్క్ ప్రెజర్‌లో నుంచి బయటకు అడుగుపెట్టే టెకీలకు ఇవి ఎంతో రిలీఫ్‌అందిస్తాయని మైండ్‌స్పేస్‌లో సాఫ్ట్‌వేర్ నిపుణుడైన రవికుమార్ తెలిపారు. మరోవైపు జాబ్ ప్రిపరేషన్‌కోసం అశోక్‌నగర్‌లో ఉండే యువ అభ్యర్థులు కూడా మనసును ఉత్తేజపరచుకోవడానికి అప్పుడప్పుడు ఇక్కడికి వస్తుంటారని చెప్పారు.

### ఈ ప్రాంతాల్లో ఎక్కువగా

హైటెక్‌సిటీలో పెద్ద పెద్ద మాల్స్, రూఫ్‌టాప్ రెస్టారెంట్లు, కార్పొరేట్ లాంజ్‌లతో రాత్రిపూట ఉత్సాహభరితమైన వాతావరణం సంతరించుకుంటుంది.హైటెక్ సిటీకి ఆనుకొని ఉండటం వల్ల కొండాపూర్‌కు కూడా అదే కళ వచ్చింది. ఇక్కడి పబ్‌లు, కేఫ్‌ల్లో జనసందోహంతో సందడిగా ఉంటుంది. ఇక వీకెండ్స్‌లో మరింత ఎక్కువ.ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాంగూడలు ఇప్పుడు విలాసవంతమైన పబ్‌లకు కేరాఫ్‌గా మారాయి. ఇక్కడ ప్రీమియం పబ్‌లు, రెస్టారెంట్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. విశాలమైన ప్రాంగణాలు, విభిన్నమైన స్టైలిష్ అలంకరణతో సందర్శకులను ఆకట్టుకుంటాయి.ఓవైపు అద్దాల మేడల్లా ఐటీ భవనాలు, మరోవైపు ఓఆర్ఆర్‌సుందర దృశ్యాలను ఆస్వాదించడానికి కోకాపేట్ మంచి వేదిక. ఇక్కడ ఇప్పుడిప్పుడే లైవ్‌మ్యూజిక్ ప్రదర్శనలు కూడా నడుస్తూ ఎంతో సందడి చేస్తున్నాయి.నగరానికే స్పెషల్‌అట్రాక్షన్‌గా నిలుస్తున్న కేబుల్‌బ్రిడ్జ్‌పై రద్దీ అంతా ఇంతా కాదు. బ్రిడ్జిపై వాక్‌వేయాపై నడుస్తూ దుర్గం చెరువు, వెలిగిపోతున్న ఐటీ భవనాలను చూడొచ్చు. ఇక్కడ వేడుకలు జరుపుకోవద్దని పోలీసులు హెచ్చరించినా, జరిమానాలు విధించినా యువత అస్సలు తగ్గడం లేదు.

## ఖైరతాబాద్‌లో గెలుస్తాం...
## టికెట్ అడిగే హక్కు నాకుంది: బీజేపీ నేత చింతల

**ఖైరతాబాద్ టికెట్ ఆశించే హక్కు తనకు ఉందన్న చింతల రామచంద్రారెడ్డి**

**ఉపఎన్నికలో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా**

**దానం పార్టీ మారగానే శాసనసభ్యత్వం రద్దు చేయాల్సిందని వ్యాఖ్య**



ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉపఎన్నికలో బీజేపీ టికెట్‌ను ఆశించే హక్కు తనకుందని, అక్కడ పార్టీ గెలుపు ఖాయమని బీజేపీ సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖాళీ అయిన ఈ స్థానంపై ఆయన తన ఆసక్తిని స్పష్టం చేశారు.దానం నాగేందర్ పార్టీ మారి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసినప్పుడే ఆయన శాసనసభ్యత్వం రద్దు చేయాల్సిందని చింతల అభిప్రాయపడ్డారు. దానం అనర్హత కోసం బీజేపీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసిందని, చివరికి తమ ప్రయత్నాలు ఫలించాయని ఆయన అన్నారు.తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ స్థానాలతో పాటు, గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలను కూడా గెలుచుకుందని, అదే స్ఫూర్తితో ఖైరతాబాద్‌లోనూ విజయం సాధిస్తామని చింతల అన్నారు. "అభ్యర్థిని పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుంది. కానీ టికెట్ అడిగే హక్కు నాకుంది. ఇతరులు కూడా అడగవచ్చు. నేను ఎప్పుడూ ఖైరతాబాద్‌ను విడిచిపెట్టలేదు. పార్టీ అవకాశం ఇస్తే కచ్చితంగా పోటీ చేసి గెలుస్తాను'' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రేమను నిరాకరించిందని..
## శంషాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై సహోద్యోగి దాడి

**విమానాశ్రయం నుంచి కారులో కిడ్నాప్ చేసిన సహోద్యోగి**

**మార్గమధ్యలో చితకబాది కిందకు తోసేసిన వైనం**

**గతంలోనే వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ పోలీసులు**

హైదరాబాద్‌లో ఘోరం జరిగింది. ప్రేమను నిరాకరించిందన్న నెపంతో ఓ యువకుడు, తన సహోద్యోగి అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడికి తెగబడ్డాడు. శంషాబాద్ విమానాశ్రయం పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.ఝార్ఖండ్‌కు చెందిన



25 ఏళ్ల యువతి మాదాపూర్‌లో నివసిస్తూ, నగరంలోని ఓ ప్రముఖ ఐటీ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తోంది. అదే సంస్థలో పనిచేసే ఆకాశ్ అనే యువకుడు గత ఏడాది కాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు గతంలోనే మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పట్లో అతను వెనక్కి తగ్గాడు.ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని బంధువుల ఇంటి నుంచి విమానంలో తిరిగి వస్తున్న ఆమెను శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆకాశ్ అడ్డగించాడు. ఆమెను బెదిరించి బలవంతంగా కారులో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు తీసుకువెళ్లాడు. మార్గమధ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆగ్రహించిన ఆకాశ్, యువతిపై పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం ఆమెను కారులో నుంచి కిందకు నెట్టేసి అక్కడి నుంచి పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన బాధితురాలిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడు ఆకాశ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఏపీలో 16న 'సర్'తుది ఓటర్ల జాబితా
## సవరించిన షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార గడువును కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 10 వరకు పొడిగించింది. తుది ఓటర్ల జాబితాను 16న ప్రచురించనుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార గడువును కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 10 వరకు పొడిగించింది. తుది ఓటర్ల జాబితాను 16న ప్రచురించనుంది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను నిన్న(బుధవారం) విడుదల చేసింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 5 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కారం పూర్తి చేయాలి. 9న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలి.అయితే కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికీ నో మ్యాపింగ్, వివిధ లోపాల కేసుల విచారణ పెండింగ్‌లో ఉండటం, కొత్తగా ఓటు హక్కు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన ఫాం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం ఇంకా పూర్తికాకపోవడంతో గడువు పొడిగించారు. ఈ వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు.44.28 లక్షల మంది ఓటర్లకు నోటీసులు : రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో లోపాలు, తప్పిదాలు ఉన్నట్లు గుర్తించిన 44.28 లక్షల మంది ఓటర్లకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే 44 లక్షల మందికి పైగా విచారణ పూర్తికాగా, వారిలో 1.53 లక్షల మందిని అనర్హులుగా తేల్చింది. మరో 41 లక్షల మంది పేర్లను తుది ఓటర్ల జాబితాలో కొనసాగించాలని నిర్ణయించింది.ఎన్నికల సంఘం వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 44,28,444 మందికి నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటివరకు 43.71 లక్షల మందికి పంపిణీ పూర్తైంది. నోటీసులు అందుకున్న వారిలో 44,00,225 మంది విచారణకు హాజరయ్యారు. వీరిలో 41,00,002 మంది సమర్పించిన వివరాలు సక్రమంగా ఉన్నట్లు తేలడంతో వారి పేర్లను తుది జాబితాలో కొనసాగించాలని నిర్ణయించారు. మరో 1,46,623 మంది సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది. ఇంకా 28,619 మంది ఓటర్ల విచారణ మిగిలి ఉండగా, దీనికి అక్టోబరు 10 వరకు గడువు ఉంది.ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాచింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పిదాలు, లోపాలతో కూడిన వివరాలతో మ్యాచింగ్ చేసుకున్నారు. అలాంటి వారందరికీ ఎన్నికల సంఘం నోటీసులిచ్చి విచారించింది.2002 నాటి ఓటర్ల జాబితాతో సరిపోల్చాల్సి ఉంది : సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత ఓటర్ల జాబితాలోని వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాతో సరిపోల్చాల్సి ఉంటుంది. అయితే చాలామంది ఓటర్లు తమ పేరు, తల్లిదండ్రులు లేదా తాతలు, నాన్నమ్మల వివరాలను మ్యాచింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పులు, లోపాలతో కూడిన వివరాలను నమోదు చేశారు. ఇలాంటి లోపాలు ఉన్నవారే ఎక్కువగా నోటీసులు అందుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 44.23 లక్షల మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు గుర్తించగా, వారిలో 43.71 లక్షల మందికి ఇప్పటివరకూ నోటీసుల పంపిణీ పూర్తయింది. నోటీసులు అందుకున్న వారిలో 36 లక్షల మంది తప్పిదాలు, లోపాలతో మ్యాచింగ్ చేసుకున్న వారే ఉన్నారు.పరిశీలనలో వెలుగులోకి కీలక విషయాలు : ఎన్యూమరేషన్ పత్రాల పరిశీలనలో పలు అసంగతులు బయటపడ్డాయి. తల్లిదండ్రులు--పిల్లల మధ్య వయసు తేడా 15 ఏళ్ల కంటే తక్కువగా, 50 ఏళ్ల కంటే ఎక్కువగా నమోదు కావడం, ఓటరు--తాత లేదా నాన్నమ్మ మధ్య వయస్సు తేడా 40 ఏళ్ల కంటే తక్కువగా ఉండటం వంటి లోపాలు అధికారులు గుర్తించారు. అలాగే ప్రస్తుత జాబితా, 2002 జాబితాలో తండ్రి పేరులో తేడాలు ఉండటం, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయస్సు తేడా 9 నెలల కంటే తక్కువగా నమోదు కావడం, ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల వివరాల్లో తప్పులు వంటి లోపాలు కూడా వెలుగుచూశాయి.ఈ తరహా తప్పిదాలున్న ఓటర్లందరికీ నోటీసులు జారీ చేసి, ఆధారాలు సమర్పించాలని ఎన్నికల సంఘం సూచించింది. విచారణ పూర్తై అర్హత నిర్ధారణ అయిన వారి పేర్లు మాత్రమే అక్టోబరు 16న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో ఉండనున్నాయి.

తొలివార్త

శుక్రవారం 02 - 10 - 2026



## మహేష్ బాబు 'వారణాసి' షూటింగ్ పూర్తి.. ఇక చివరి దశ పనులు జరుపుకుంటున్న రాజమౌళి చిత్రం!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'. గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజమౌళి గత చిత్రాలకు భిన్నంగా మరింత విస్తృతమైన ప్రపంచాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా 'వారణాసి' నిలుస్తోంది. ఈ సినిమా ద్వారా మహేష్ బాబు తొలిసారి రాజమౌళితో కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లోనే కాకుండా సినీ వర్గాల్లోనూ ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథ, పాత్రలు, చిత్రీకరణ, నిర్మాణ విలువలను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించింది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'వారణాసి'లో మహేష్ బాబు చేయాల్సిన షూటింగ్ భాగం పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో ఇక మహేష్ బాబు తన తదుపరి పనులపై దృష్టి పెట్టేందుకు సిద్ధమవుతున్నారనే చర్చ మొదలైంది. అయితే చిత్ర బృందం నుంచి ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాజమౌళి సినిమా అంటే ప్రతి సన్నివేశాన్ని అత్యంత జాగ్రత్తగా తెరకెక్కించడం, అవసరమైన స్థాయిలో భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాలు రూపొందించడం సహజం. అందుకే 'వారణాసి' షూటింగ్ విషయంలోనూ భారీ షెడ్యూల్స్ కొనసాగుతున్నాయి. మహేష్ బాబు తన భాగాన్ని పూర్తి చేసుకున్నా.. మిగిలిన నటీనటులతో కీలక సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణ ప్రకారం 'వారణాసి' ప్రధాన షూటింగ్ అక్టోబర్ మొదటి వారంలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే భారీ స్థాయి నిర్మాణం కావడంతో షూటింగ్ పూర్తయిన తర్వాత కూడా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక పనులకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సినిమా కథ, నేపథ్యం, పాత్రల వివరాలను చిత్ర బృందం పూర్తిగా రహస్యంగా ఉంచుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, టైటిల్‌కు సంబంధించిన సమాచారం సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ముఖ్యంగా మహేష్ బాబు పాత్ర ఎలా ఉండబోతోంది? ప్రియాంక చోప్రా పాత్ర ఏ స్థాయిలో ఉంటుంది? పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతోంది? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

## ప్యారడైజ్.. నిజమైన ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్న నాని



తన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలపై వచ్చిన కోర్టు ఉత్తర్వుల విషయంలో నేచురల్ స్టార్ నాని పూర్తి స్పష్టత ఇచ్చారు. బెంగళూరు కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సృష్టించిన ఫేక్ పోస్టులు, బాట్లకు మాత్రమే వర్తిస్తుందని, నిజమైన ప్రేక్షకుల అభిప్రాయాలకు కాదని తేల్చి చెప్పారు. సినిమా చూసి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే హక్కు ప్రేక్షకులకు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నకిలీ, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నిర్మాత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ బెంగళూరు సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 19న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై ముంబైలో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ... కొంతమంది డబ్బులు ఇచ్చి బాట్లతో, ఏఐ టెక్నాలజీతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటం అలాంటి వారిపైనే తప్ప, నిజమైన సినీ ప్రియులపై కాదని ఆయన వివరించారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు తమ విమర్శలను, అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా చెప్పవచ్చని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రేపు (సెప్టెంబర్ 24) 'ది ప్యారడైజ్' విడుదల కానుంది. ఇప్పటికే సెప్టెంబర్ 23 రాత్రి పలు నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



## మనం పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం? ఎయిర్‌పోర్ట్‌లో ధనుశ్‌కు ఊహించని ప్రశ్న, నవ్వుతూ దాటేసిన హీరో!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం 'రాయన్' కు ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. ఈ వేడుకల అనంతరం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పయణమవుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా అక్కడున్న ఒక మీడియా రిపోర్టర్ సరదాగా ధనుష్‌ను ఉద్దేశించి, (మనం రాజకీయ పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం?) అని ప్రశ్నించారు. సీఎం విజయ్ తర్వాత ధనుష్ కూడా పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న వార్తల సందర్భంగా ఈ ప్రశ్నను రిపోర్టర్ అడిగారు. అయితే ఈ ఊహించని ప్రశ్నకు ధనుష్ ఎలాంటి సీరియస్ వ్యాఖ్యానాలు చేయకుండా, కేవలం చిరునవ్వు నవ్వుకుంటూ అక్కడి నుంచి సైలెంట్‌గా వెళ్లిపోయాడు ధనుష్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## అదరగొట్టేసిన రష్మిక మందన్నా.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా మైసా టీజర్ వ్యూస్

కన్నడ భామ రష్మిక మందన్నా తొలిసారి యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్న ప్రాజెక్ట్ మైసా పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుపూ సినిమాపై అంచనాలు పెంచేస్తుందని తెలిసిందే. ఇక రెండు రోజుల క్రితం లాంచ్ చేసిన టీజర్ రష్మిక మందన్నాలోని మరో యాంగిల్‌ను చూడబోతున్నట్టు చెప్పేస్తుంది. డీగ్లామరైజ్‌డ్‌గా యాక్షన్ అవతార్‌లో గూస్‌బంప్స్ తెప్పించే యాక్టింగ్‌తో అదరగొట్టేస్తుంది. మైసా టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. టీజర్ లాంచ్ చేసిన కొన్ని గంటల్లోనే 25 మిలియన్లకుపైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. రష్మిక మందన్నా ఊహించని లుక్‌లో అదరగొట్టేస్తూ.. విజయశాంతిని గుర్తుకు తెస్తోందంటూ కామెంట్లు పెడుతున్నారు మూవీ లవర్స్. ఈ మూవీలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని టీజర్‌తో తెలిసిపోతుంది. మైసా సినిమాతో ఘుఋఅసతీఖు ౖాబశ్రీశ్రీవ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడు. డెబ్యూ డైరెక్టర్ ఎంట్రీతోనే బాక్సాఫీస్‌ను షేక్ చేయడం పక్కా అని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి.



## రూ. 100 కోట్ల వసూళ్లు.. 'మండాడి' టీమ్‌పై కమల్ హాసన్ ప్రశంసలు!

ప్రముఖ నటుడు సూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'మండాడి' ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల వసూళ్లను రాబట్టి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, లెజెండరీ నటుడు కమల్ హాసన్ ఈ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మత్స్యకారుల జీవితాలు మరియు సంప్రదాయ పడవ రేసుల (పాయ్ మార పడగు) నేపథ్యంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూరితో పాటు సుహాస్ కీలక పాత్రల్లో నటించారు. సెప్టెంబర్ 10న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ. 109.25 కోట్ల ప్రపంచవ్యాప్త వసూళ్లను సాధించింది. అయితే తాజాగా ఈ సినిమాను చూసిన కమల్ హాసన్ చిత్రబృందానికి కలుసుకుని సినిమాపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఇక కమల్ హాసన్‌ను కలవడం తన జీవితంలో మరువలేని క్షణమని హీరో సూరి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. "డాక్టర్ కమల్ హాసన్ సర్, మీ నిస్వార్థమైన ప్రేమ, శక్తివంతమైన మాటలు, దీవెనలు మా మండాడి ప్రయాణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అంటూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు మతిమారన్ పుగళేంది కూడా స్పందిస్తూ, సినిమా రంగంలో సీనియర్ విద్యార్థి, నిరంతరం స్ఫూర్తినిచ్చే కమల్ హాసన్‌ను కలవడం సంతోషంగా ఉందని, తమ చిత్రాన్ని అభినందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రంలో ప్రతినాయక పాత్రలో నటించిన టాలీవుడ్ నటుడు సుహాస్ మాట్లాడుతూ, కొన్ని క్షణాలు మనల్ని నిశ్చేష్టులను చేస్తాయి. నట దిగ్గజం కమల్ హాసన్ సర్ పక్కన నిలబడటం నా కల సాకారమైన క్షణం అంటూ తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040